డీసీసీబీ చైర్మన్ పదవికి కోలా గురువులు రాజీనామా

విశాఖపట్నం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ పదవికి వైసీపీ నేత కోలా గురువులు శుక్రవారం రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేస్తున్నట్టు సహకార శాఖ కమిషనర్/రిజిస్ట్రార్‌కు పంపిన లేఖలో పేర్కొన్నారు. చైర్మన్ పదవిలో కొనసాగేందుకు వచ్చే నెల 17వ తేదీ వరకు గడువు ఉంది. అయితే వైసీపీ ఓటమి నేపథ్యంలో నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారంతా తమ పదవులకు రాజీనామా చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలు జారీచేశారు. కాగా విశాఖ డీసీసీబీ పాలకవర్గంలో పర్సన్‌లు(డైరెక్టర్లు)గా ఉన్న ఇద్దరు ఇప్పటికే తమ పదవులకు రాజీనామా చేశారు.

ప్రజాగ్రహం

రుషికొండ భవనంపై టీడీపీ జెండా

- సీతకొండ వ్యూ పాయింట్ వద్ద వైఎస్ఆర్ పేరు తొలగింపు
- టైకూన్ సెంటర్‌లో రోడ్డు బ్లాక్స్ తొలగింపునకు నగరవాసుల యత్నం
- ఏయూలో సంబరాలు
- వైసీపీ నేతలు, వారి బంధువుల గుప్పిట్లోకి వెళ్లిపోయిన ఏసీఏ, ఫిల్మ్ క్లబ్‌ల సంగతి ఏమిటో?

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

గత ఐదేళ్లలో వైసీపీ నాయకులు తీసుకున్న నిర్ణయాలపై విశాఖపట్నంలో ప్రజలు ఇప్పుడు బహిరంగంగా తమ అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ నేతలు సొంత ప్రయోజనాల కోసం తీసుకున్న నిర్ణయాలు, నిధుల దుర్వినియోగంపై వ్యతిరేకత వ్యక్తంచేస్తున్నారు.



సీతకొండ వైఎస్ఆర్ వ్యూపాయింట్ పేరు మార్పు

ఓట్ల లెక్కింపు రోజున కూటమి విజయం దిశగా వెళుతున్నదని తెలియగానే తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులు ఎక్కడ లేని ధైర్యాన్ని తెచ్చుకొని రుషికొండపైకి వెళ్లి అక్కడ రూ.450 కోట్లతో సీఎం క్యాంపు కార్యాలయం కోసం నిర్మించుకున్న భవనంపై తమ పార్టీ జెండా రెపరెపలాడించారు. ప్రజాధనంతో ప్రభుత్వం నిర్మించిన ఆ భవనం ఛాయలకు గత మూడేళ్లలో ఎవరినీ అనుమతించకపోవడంపై అందరిలోను తీవ్రమైన అసంతృప్తి ఉండేది. దానికి సెక్యూరిటీని పెట్టి ప్రైవేటు భవనంలా చేసేశారు. దానిని జీర్ణించుకోలేని సానుభూతిపరులు ఆ ప్రాంగణంలోకి వెళ్లి జెండా ఎగురేశారు.


రుషికొండ భవనంపై టీడీపీ జెండా ఎగురవేస్తున్న దృశ్యం (ఫైల్)


టైకూన్ సెంటర్‌లో రోడ్డు బ్లాక్స్ తొలగింపు (ఫైల్)

సీతకొండ సమీపాన బీచ్ వ్యూ పాయింట్‌కు 'వైఎస్ఆర్' పేరు పెట్టారు. అది సమంజసంగా లేదని కొందరు యువత ఫలితాలు వెలువడిన రాత్రే అక్కడికి చేరుకొని వైఎస్ఆర్ పేరుపై 'అబ్దుల్ కలామ్' పేరు కలిగిన స్టిక్కర్ అంటించారు. ఇది సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది.

సిరిపురం జంక్షన్ నుంచి వీఐపీ రోడ్డులోకి వాహనాలు రాకుండా టైకూన్ సెంటర్‌లో బ్లాక్స్ ఏర్పాటు చేశారు. దీనిపై ఎన్ని విమర్శలు వచ్చినా తీయించేస్తామని వైసీపీ నేతలు డ్రామాలు ఆడారే తప్ప ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. పోలీసులు కూడా మొండిగా వ్యవహరించారు. ప్రజలను

... మిగతా 6వ పేజీలో

ఏయూలో విగ్రహం మాటేమిటో?

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం తొలగించాలని రెండు రోజులుగా విద్యార్థుల ఆందోళన

- పాలక మండలి అంగీకారం
- ఏయూలోనూ వైఎస్ఆర్ విగ్రహం
- 2009లో ఏర్పాటు... అప్పట్లోనే విమర్శలు
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో కూడిన ఆ విగ్రహం స్థానంలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయించిన ప్రస్తుత వీసీ ప్రసాదరెడ్డి
- విగ్రహం తొలగించాల్సిందేనని విద్యార్థి సంఘాల డిమాండ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటుచేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని విద్యార్థి సంఘాల డిమాండ్ మేరకు శుక్రవారం పాలక మండలి తొలగించింది. విద్యా సంస్థల్లో రాజకీయ నాయకుల విగ్రహాలు ఉండకూడదనే నిబంధనను ఉల్లంఘించి ఏర్పాటుచేసినందున దానిని తొలగించాలంటూ విద్యార్థి సంఘాలు రెండు రోజులుగా ఆందోళన చేస్తున్నాయి. దాంతో అధికారులు విగ్రహం తొలగించేందుకు అంగీకరించారు. ఈ నేపథ్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గల వైఎస్ఆర్ విగ్రహంపై చర్చ మొదలైంది. ఎప్పుడు తొలగిస్తారో ఇక్కడి అధికారులు ప్రకటించాల్సి ఉంది.


వైఎస్సార్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో వీసీ ప్రసాదరెడ్డి (ఫైల్ ఫొటో)

పదవుల కోసం విగ్రహాలు

పదవుల కోసం, తమ మనుగడ కోసం కొంతమంది ఆచార్యులు సరస్వతీ నిలయాల్లో రాజకీయ క్రీడకు తెర తీశారు. ఆ విధంగానే ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 2009లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ఏర్పాటైంది. దానిపై ఆనాడే విమర్శలు వెల్లువెత్తాయి. కానీ ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. అప్పుడు ఉప కులపతిగా బీల సత్యనారాయణ ఉన్నప్పటికీ తెర వెనుక కథ అంతా నడిపింది మాత్రం ప్రస్తుత వైస్ చాన్సలర్ ప్రసాదరెడ్డేనని చెబుతారు. అక్కడితో ఊరుకోలేదు. వీసీ సీట్లో కూర్చున్నాక ప్రసాదరెడ్డి వైఎస్ఆర్‌సీపీకి ప్రధాన వ్యూహకర్తగా మారిపోయారు. ఉత్తరాంధ్ర పార్టీ బాధ్యతలు చేపట్టిన ఎంపీ విజయసాయిరెడ్డికి ఈ ప్రాంతంపై పట్టు లేకపోవడంతో విద్యావంతుడైన ప్రసాదరెడ్డిపై ఆధారపడ్డారు. అదే అదునుగా వీసీ చక్రం తిప్పారు. పార్టీలో నాయకులపై నివేదికలు ఇవ్వడం, జీవీఎంసీ ఎన్నికల్లో టికెట్లు ఖరారు, ఆ తరువాత నామినేటెడ్ పోస్టులు ఎవరికి ఇవ్వవచ్చు...అనే అంశాలపై ఆయనే ఫీడ్ బ్యాక్ ఇచ్చేవారు. పార్టీ జయాపజయాలపై విద్యార్థులతో సర్వేలు చేయించి నివేదికలు పంపేవారు. ఏయూను రాజకీయ కేంద్రంగా మార్చేశారు. గత ఏడాది చివరిలో ఆయన పదవీకాలం పూర్తవుతున్న తరుణంలో ఏయూలో రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద గతంలో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ విగ్రహం స్థానంలో కొత్తగా భారీ కాంస్య విగ్రహం

... మిగతా 6వ పేజీలో


నగరంలోని వైసీపీ కార్యాలయం

వైసీపీ ఆఫీస్ సిబ్బందికి జీతాలు నిల్

- రెండు నెలలుగా పెండింగ్
- మేనేజర్‌కు మూడు నెలలుగా అందని వేతనం
- రెండు నెలలుగా విద్యుత్ బిల్లు కూడా కట్టలేదని సమాచారం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలోని వైఎస్ఆర్‌సీపీ కార్యాలయం గత మూడు రోజులుగా వెలవెలబోతోంది. ఎన్నికల్లో ఘోర పరాజయం చవిచూడడంతో నాయకులు కన్నెత్తి చూడడం లేదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎండాడలో రెండెకరాల ప్రభుత్వ భూమిని లీజు (ఏడాదికి కేవలం వెయ్యి రూపాయలు) ప్రాతిపదికన కేటాయించుకుని పార్టీ కార్యాలయం కోసం భారీ భవనం నిర్మించారు. కార్యాలయాన్ని చూసుకోవడానికి వాచ్‌మన్‌ను, మొక్కలకు నీరు పోయడానికి ఒకరిని, కార్యాలయాన్ని శుభ్రం చేయడానికి ఇద్దరిని, వచ్చే అతిథులకు టీ, కాఫీలు అందించడానికి ఇద్దరు పనివాళ్లను పెట్టుకున్నారు. వీరికి ఒక్కొక్కరికి రూ.7 వేలు నుంచి రూ.8 వేల జీతం ఇస్తున్నారు. అదే వారికి జీవనాధారం. ఉదయం 9 గంటలకు వచ్చి, సాయంత్రం ఆరు గంటల వరకూ అక్కడే ఉంటారు. ఇంకో పని చేసుకోవడానికి లేదు. అయితే వీరికి గత రెండు నెలలుగా జీతాలు ఇవ్వలేదు. పార్టీ కార్యాలయ నిర్వహణ బాధ్యత జిల్లా అధ్యక్షులు చూసుకోవాలి. మొదటి నుంచి దానిని అంతా భారంగానే భావిస్తూ వచ్చారు. ప్రస్తుత అధ్యక్షులు కోలా గురువులు తాను జీతాలు ఇచ్చే స్థితిలో లేనని ముందే చెప్పడంతో ఈ బాధ్యతను గాజువాకకు చెందిన దామా

... మిగతా 6వ పేజీలో

ఫ్రీ హోల్డ్‌లో సిబ్బంది బలి!


ఆనందపురం మండలంలో రామవరం భూములు

- 'రామవరం' భూమి వ్యవహారంలో తమ తప్పును కప్పి పుచ్చుకునేలా అధికారుల నివేదిక
- గ్రామ రెవెన్యూ అధికారి, రెవెన్యూ సహాయకుడు, తహసీల్దారు కార్యాలయంలో ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్ల జారీకి ప్రతిపాదనలు సిద్ధం చేసే ఉద్యోగిపై చర్యలకు సిఫారసు
- మరింత లోతుగా దర్యాప్తునకు గ్రామస్థుల డిమాండ్


విశాఖపట్నం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి):

ఆనందపురం మండలం రామవరం సర్వే నంబరు 164-3లో 1.53 ఎకరాలకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ మంజూరు వ్యవహారంలో తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కింది స్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు మండల స్థాయి అధికారులు నివేదిక సమర్పించినట్టు తెలిసింది. రామవరం గ్రామ రెవెన్యూ అధికారి, రెవెన్యూ సహాయకుడు, తహసీల్దారు కార్యాలయంలో ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్ల జారీకి ప్రతిపాదనలు సిద్ధం చేసే ఉద్యోగిపై చర్యలకు సిఫారసు చేసినట్టు సమాచారం. ఇంకా ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ల మంజూరుకు ముందు గ్రామంలో క్షేత్రస్థాయి విచారణ చేపట్టినప్పుడు రెవెన్యూ సిబ్బందిని తప్పుదోవ పట్టించి సర్వే నంబరు 164-3లో 1.53 ఎకరాలకు డీపట్టా పొందిన రైతు, అతని భూమిని లీజుకు తీసుకున్న ఆసామితోపాటు స్థానిక ప్రజా ప్రతినిధిపై క్రిమినల్ చర్యలకు సిఫారసు చేశారని తెలిసింది.

రామవరం సర్వే నంబర్ 164-3లో 1.53 ఎకరాలను గ్రామంలో 57 మంది గూడులేని నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించిన అధికారులు అందుకోసం లేఅవుట్‌కు అనుమతించారు. అయితే అదే 1.53

... మిగతా 6వ పేజీలో

ఆకర్షణీయమైన బోధనతోనే చిన్నారుల్లో వికాసం: ఆర్‌జేడీ


శిక్షణలో మాట్లాడుతున్న ఆర్జేడీ విజయభాస్కర్

కంచరపాలెం, జూన్ 7: ఆకర్షణీయమైన బోధనతో చిన్నారులకు వికాసవంతమైన విద్యనందించవచ్చునని జోన్-1 ఆర్జేడీ విజయభాస్కర్ పేర్కొన్నారు. నగరంలో రెండు రోజులుగా జరుగుతున్న ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) డీఆర్పీల శిక్షణ శిబిరాన్ని ఆయన శుక్రవారం సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో ఒకటి, రెండు తరగతుల ఉపాధ్యాయులు ఆటపాటలతో చిన్నారులను ఆకట్టుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు నిరంతరం నూతన పోకడలపై పట్టుసాధిస్తూ బోధనలో అన్వయించుకోవాలని సూచించారు. డీఈవో చంద్రకళ, ఏపీసీ శ్రీనివాసరావు శిక్షణ కరదీపిక, మూల్యాంకన కిట్‌ల వినియోగం, నిర్వహణపై వివరించారు. కోర్సు కో ఆర్డినేటర్ సమగ్ర శిక్ష ఏఎంవో డా.జి.లక్ష్మి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో 11 మండలాల నుంచి డీఆర్పీలు, ఎంఈవోలు రామారావు, బాలామణితోపాటు కీ రీసోర్స్ పర్సన్‌లు సోమయాజులు, హరికృష్ణ, రాజకిరణ్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

జగదాంబ కూడలి, జూన్ 7: గ్రంథాలయాల్లో పుస్తక పఠనం అలవరుచుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలుగు భాషా ఉపాధ్యాయుడు డి. సంజీవ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జగదాంబ సమీపంలో ఉన్న జిల్లా గ్రంథాలయంలో శుక్రవారం జరిగిన వేసవి విజ్ఞాన శిక్షణ ముగింపు కార్య క్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.పట్టుదలతో కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చునన్నారు. పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు అన్నిరకాల పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచామని గ్రంథాలయ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు పేర్కొన్నారు. సామాజిక కార్యకర్త కేవీఎస్ నరసింహం.గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని అన్నారు. ఈ సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, క్రాఫ్ట్ వర్క్ విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు.

యూడీజీ లీక్‌తో అవస్థలు


ఎల్లమ్మతోటలో లీకైన యూడీజీ లీకు

డాబాగార్డెన్స్, జూన్ 7: గ్రేటర్ 31వ వార్డులోని ఎల్లమ్మతోట సీపీఎం ఆఫీస్‌రోడ్డులో యూడీజీ లీకై రోడ్డుపైనే మురుగునీంతా ప్రవహిస్తోంది. దీంతో స్థానికులు, అటుగా రాకపోకలు సాగించేవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.దుర్వాసనకు ముక్కుమూసుకుని వెళ్లాల్సివస్తోందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి యూజీడీ లీకేజీ నివారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేకుంటే దోమలు వృద్ధి వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉందని ఆవేదనవ వ్యక్తం చేస్తున్నారు.


కేక్ కట్ చేస్తున్న నజీర్, నాయకులు


42వ వార్డులో విజయోత్సవాలు

కూటమి శ్రేణుల విజయోత్సవ రాలీలు

సీతమ్మధార, జూన్ 7: గ్రేటర్ 14వ వార్డులో వార్డు అధ్యక్షులు పి.వి. వసంత రావు, గొంప ధర్మరావులు ఆధ్వర్యంలో కూటమి అభ్యర్థులు ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు గెలుపొందడంపై విజయోత్సవాలను నిర్వహించారు. సీతమ్మధార అభయ అంజనేయస్వామి ఆలయం ఆర్టీ సమీపంలో కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ నాయకులు, సభ్యులు హరిత, ప్రసాద్, రాయుడు వెంకటరమణ,, వై.కృష్ణ, జి.రాంబాబు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: విశాఖ నగరంలో కూటమి అభ్యర్థులు విజయం సాధించడంతో టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీని, గాజువాక ఎమ్మెల్యేగా విజయం సాధించిన పల్లా శ్రీనివాస్‌ను 42వ వార్డు అధ్యక్ష, కార్యదర్శులు కన్నం వెంకట రమణారావు, ముక్కి రామకృష్ణ శుక్రవారం కలిసి అభినందనలు తెలిపి మిఠాయిలు తినిపించారు. వీరిని కలిసిన వారిలో నాయకులు శ్రీకృష్ణ, ఎంఎల్ఎన్ రావు, దు వ్వి కాశీప్రసాద్, జనపల కృష్ణ, బంగారి నవీన్ ఉన్నారు. సౌత్ ఎమ్మెల్యేగా వి జయం సాధించిన వంశీకృష్ణ శ్రీనివాస్‌కు 27వ వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి, అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దొండపర్తి పురవీధుల్లో ద్వారకానగర్, ఐఎస్‌బీ కాలనీ, భగత్‌సింగ్ కాలనీ, శ్రీనగర్, వినాయకనగర్, అశోక్‌నగర్, అమర్‌నగర్ తదితర ప్రాంతాల్లో బైక్ ర్యాలీ నిర్వహించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మీ శివ ప్రసా ద్, నాయకులు పీవీ రమణారావు, పాలికల సింహాచలం, బీప రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నార్త్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన పెనుమత్స విష్ణుకుమార్ రాజు, ఎంపీ శ్రీభరత్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించిన ప్రతి ఒక్కరికీ వార్డు అధ్యక్షుడు పుక్కళ్ల పైడికొండ ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ బూత్ ప్రెసిడెంట్లు, పాల్గొన్నారు.

'జాక్వార్' షోరూమ్ ప్రారంభం

సీతమ్మధార, జూన్ 7: నగరంలోని న్యూ రేసపువానిపాలెంలో స్వర్ణభారతి స్టేడియం సమీపాన 'జాక్వార్' షోరూమ్‌ను శుక్రవారం సూర్య ఇంటర్నేషనల్ ఎండీ డాక్టర్ పి.హరినాథ్‌బాబు ప్రారంభించారు. సాయిబాలాజీ మార్కెటింగ్ లివింగ్ లైన్స్‌లో ఈ షోరూమ్‌ను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా హరినాథ్‌బాబు మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఈ షోరూమ్‌లో అన్ని మోడళ్లు/ రకాలు అందుబాటులో ఉంటాయన్నారు. అరవై ఏళ్ల చరిత్ర కలిగిన 'జాక్వార్' కంపెనీ ఉత్పత్తులను భారత్‌లో విక్రయించడంతో పాటు 66 దేశాలకు ఎగుమతి అవుతున్నట్టు వివరించారు. జాక్వార్‌లో షవరింగ్ క్లోజెస్, ప్యానల్స్, వర్ల్‌పూల్, స్పా, వాటర్ హీటర్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. దేశంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న సంస్థగా 'జాక్వార్' నిలుస్తుందన్నారు. విజయనగరం, మధురవాడతోపాటు విశాఖ నగరంలో మూడు షోరూమ్‌లు ఉన్నాయన్నారు. షోరూమ్ ప్రొప్రయిటర్ ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచంలోనే గుర్తింపు ఉన్న జాక్వార్ కంపెనీకి డీలర్‌గా, డైరెక్టర్స్ క్లబ్ మెంబర్‌గా తనకు అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. కస్టమర్లకు అందుబాటులో ఉంటూ అత్యుత్తమ సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి హెడ్ (ఏపీ అండ్ టీఎస్) అభిజీత్‌సింగ్, కంపెనీ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.


రేసపువానిపాలెంలో షోరూమ్ ప్రారంభిస్తున్న సూర్య ఇంటర్నేషనల్ ఎండీ డాక్టర్ హరినాథ్‌బాబు

పల్లా శ్రీనివాస్‌కు బీసీ కమిటీ సన్మానం


పల్లా శ్రీనివాస్‌కు అభినందనలు తెలుపుతున్న పరదేశీ తదితరులు

మహారాణిపేట, జూన్ 7: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలుపొందిన గాజువాక శాసన సభ్యుడు పల్లా శ్రీనివాసరావును టీడీపీ బీసీ కమిటీ రాష్ట్ర కార్యదర్శి బొట్టా పరదేశీయాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం నాయకులు మర్యాదపూర్వకంగా కలసి పుష్ప గుచ్ఛమిచ్చి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి నరసింగరావు, ఐటీడీపీ సభ్యులు గరికిన ప్రతాప్, భాస్కరశర్మ, సారిపల్లి ఉదయ్‌భాస్కర్, బోర అప్పల సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

పూర్ణామార్కెట్, జూన్ 7: వన్‌టౌన్ కనకమహాలక్ష్మికి శుక్రవారం ఉదయం 8గంటల సమయంలో క్షీరాభిషేక సేవలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజల్లో ఉభయదాతలు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి విగ్రహానికి పసుపు, కుంకుమ పూలతో అలంకరించి భక్తుల కు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులుపాల్గొన్నారు.

గంటాకు అభినందనలు


గంటా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛమిస్తున్న మహేష్, వెంకటేశ్వరరావు

కంచరపాలెం, జూన్ 7 : మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యేగా విజయదుందుభి మోగించిన గంటా శ్రీనివాసరావును జీవీఎంసీ 55వార్డు కూటమి ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా తెలుగుయువత అధికార ప్రతినిధి జోగా మహేష్‌రావుతో పాటు 55వ వార్డు జోగా వెంకటేశ్వరరావు, బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ జి.గోవింద్ తదితరులు గంటాను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కూటమి నేతృత్వంలో రాష్ట్రం మళ్లీ అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. వైసీపీ రాక్షస పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగిందని హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ స్తంభంనుంచి జారిపడి లైన్‌మెన్ మృతి


మృతుడు పాలమరశెట్టి వెంకటరావు (ఫైల్‌ఫొటో)

వేపగుంట/ మల్కాపురం 7: అప్పన్నపాలెం సబ్‌స్టేషన్‌లో జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న పాలమరశెట్టి వెంకటరావు (45) ప్రమాదవశాత్తూ విద్యుత్ స్తంభంనుంచి జారి పడి మృతి చెం దారు. పెందుర్తి పోలీసులు, స్థానికులందించిన వివరాలివి.. అప్ప న్నపాలెం వాంబేకాలనీ ఎదుట ఉన్న సబ్‌స్టేషన్‌లో వెంకటరావు జూనియర్ లైన్‌మెన్ విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం 11.30గంటల సమయంలో మెయింటెన్స్‌లో భాగంగా స్టేషన్‌లోఉన్న ఎయిర్ బ్రేక్ స్విచ్‌లు ఆఫ్‌చేసేందుకు పైకి ఎక్కారు. ఈ క్రమంలో కాలుజారి పడిపోయాడు. కింద ఎర్తింగ్ కోసం ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మకు తలకు వెనుక భాగంలో బలంగా తగలటంతో విపరీతంగా రక్తస్రా వం జరిగింది. వెంటనే సిబ్బంది గోపాలపట్నంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించేలోపే ఆయన మృతి చెం దారు. వెంకటరావుకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవలే ఉద్యో గం పర్మినెంట్ అయినట్లు సమాచారం. కుటుంబ సభ్యులు ఫిర్యాదుతో మృతదేహాన్ని కేజీహెచ్‌కు పోస్టుమార్టం కోసం తరలించారు. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకటరావు మృతితో స్వగ్రామం కొత్తపాలెంలో విషాదఛాయలు అములుకున్నాయి. ఆయన గ్రామ గౌరీ సంఘం కార్యదర్శిగా సేవలందించారు. గౌరీ సంఘ సభ్యులు, గ్రామస్తులు వెంకటరావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపాత

రైలు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


మృతుడు వసంతకుమార్ (ఫైల్)

గోపాలపట్నం, జూన్ 7: గోపాలపట్నం నుంచి కొత్తపాలెం వెళ్లే అండర్‌పాస్‌వే సమీపాన గుర్తు తెలియని రైలు ఢీకొన్న ప్రమా దంలో యువకుడు మృతి చెందా డు. జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. విజయ నగరం జిల్లా పూసపాటిరేగ సమీపంలోని కుమిలి గ్రామా నికి చెందిన కర్రి వసంతకుమార్ (19) ఐటీఐ పూర్తి చేసి అప్రంటిస్ చేసేందుకు విశాఖ వచ్చాడు. కొత్త పాలెంలో బంధువుల ఇంటివద్ద ఉంటున్నాడు. గురువారం రాత్రి భోజనం చేసిన తరువాత బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వచ్చాడు. ఎంతకీ రాకపోవడంతో బంధువులు ఉదయం పరిసర ప్రాంతాల్లో వెతికారు. రైల్వే ట్రాక్‌పై మృతదేహం పడిఉందన్న సమాచారంతో రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా బంధువులకు స మాచారం అందించారు. కొద్ది రోజులుగా బంధువుల ఇంటివద్దనే ఉంటున్న వసంతకుమార్ అనుకోని విధంగా జరిగిన ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీ రవుతున్నారు. జీఆర్‌పీ ఎస్సై బాలాజీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య హత్య కేసులో యావజ్జీవ శిక్ష

కంచరపాలెం, జూన్ 7 : భార్యను హత్యచేసిన కేసులో భర్తకు యావజ్జీవ కారాగార శిక్షను విధిస్తున్యాయస్థానం శుక్రవారం తీర్పును వెలువరించింది. వివరాలివి.. మృతురాలు నీలపు రత్నం జీవీఎంసీలో ఆరోగ్య కార్యకర్త. భర్త నీలపు పోలరాజుతో కలిసి కంచరపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో నివాసముండేవారు. మద్యానికి బానిసై పోలరాజు నూకరత్నంను వేధిస్తు ఉండేవాడు. 2015వ సంవత్సరంలో నూకరత్నంకు చెందిన ఇల్లును వి క్రయించగా వచ్చిన రూ.1.7లక్షలు తనకు ఇవ్వాలని నూకరాజు రోజూ గొడవ పడుతుండేవాడు. కొంత సొమ్ము కనిపించకపోవడంతో తగాదా చోటు చేసుకోగా, నూకరత్నంపై భర్త పోలరాజు కిరోసిన్ పోసి నిప్పంటించాడు. కాలిన గాయాలతో ఆమె కేజీహెచ్‌లో చికిత్స పొందుతు మృతిచెందింది. దర్యాప్తు అధికారి రఘువీర్ విష్ణు నిందుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విశాఖ 6వ అదనపు జిల్లా కోర్టులో విచారణ జరిపారు. నేరం రుజువుకావడంతో ముద్దాయికి యావజ్జీవ కఠినకారాగారంతో పాటు రూ.10వేలు జరిమానా విధిస్తు సంచలన తీర్పును వెలువరించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన అధికారులను పోలీస్ కమిషనర్ డా.ఎ.రవిశంకర్, అదనపు జిల్లా మెజిస్ట్రేట్ ప్రశంసించారు.

అసైన్డ్ భూముల ఫైళ్లు స్వాధీనం చేసుకోవాలి

» జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్

సీతంపేట, జూన్ 7: విశాఖపట్నం, విజయనగరం జిల్లాల కలెక్టరేట్‌లలో అసైన్డ్ భూముల ఫైళ్లు స్వాధీనం చేసుకోవాలని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్, సాయికాంత్ వర్మలపై నిఘా పెట్టి విచారణ జరపాలన్నారు. ఈ ఇద్దరు అధికారులు విశాఖ వచ్చాక భారీగా ఆస్తులు కొనుగోలు చేశారన్నారు.

సీఎస్ జవహర్ రెడ్డి విశాఖ రాకుండా, ఇక్కడి అధికారులపై ఒత్తిడి తేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాగానే జీవో నెంబర్ 596ను రద్దు చేసి ఈజీవో కింద చేసిన లావాదేవీలను పెం డింగ్ పెట్టాలన్నారు. మొత్తం వ్యవహారంపై విచారణ జరిపి దళితుల భూములు కొట్టివేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్తరాంధ్రలో వేల కోట్ల రూపాయల విలువ చేసే వందల ఎకరాల అసైన్డ్ భూములు జీవో 596 ముసుగులో కొట్టేసిన ఐఏఎస్ అధికారులపై నిఘా పెట్టాలని, సంబంధిత ఫైళ్లు మాయంకాకుండా విశాఖ, విజయనగరం జిల్లాల కలెక్టరేట్‌ల నుంచి వాటిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.



అసైన్డ్ భూముల పత్రాలను చూపిస్తున్న మూర్తి యాదవ్

రియల్ ఎస్టేట్ వ్యాపారికి బెదిరింపు కాల్

» నిందితుడ్ని చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ సునీల్


ముద్దాయి పవన్

కొమ్మాది, జూన్ 7 : డబ్బులు ఇవ్వకపోతే కుమారుడ్ని చంపేస్తానని బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని పీఎంపాలెం పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు. నార్త్ జోన్ ఏసీపీ బి.సునీల్, పీఎంపాలెం సీఐ వై. రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. అనకాపల్లి జిల్లా రాం బిల్లి మండలం దారపాలెం గ్రామానికి చెందిన శివకోటి నాగ వెంకట పవన్ జల్సాలకు అలవాటు పడ్డాడు. దీంతో సుమారు రూ. 15 లక్షల వరకూ అప్పులు చేశాడు. ప్రస్తుతం అతను పీఎంపాలెంలో నివసిస్తున్నాడు. ఈనెల 2న అతను పీఎం పాలెం కార్ షెడ్ ప్రాంతానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి పోతిన వెంకట్రావుకు వాట్సాప్ కాల్ చేసి రూ. 20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే తన కుమారుడ్ని చంపుతానని బెదిరించాడు. దీంతో భయభ్రాంతులకు గురైన వెంకటరావు ఆ నంబరును ఫోన్‌లో బ్లాక్ చేశాడు. రెండు రోజుల తరువాత ఆ నంబరును అన్ బ్లాక్ చేయగా డబ్బులు ఇవ్వకపోతే నీకుమారుడ్ని చంపేస్తానని పవన్ నంబరు నుంచి మెసేజ్ వచ్చింది. దీంతో భయపడిన బాధితుడు పవన్‌కు ఫోన్ చేసి తన కుమారుడికి హాని తలపెట్టవద్దని రూ.5 లక్షల ఇవ్వడానికి అంగీకరించాడు. డబ్బులు సమకూర్చుకునేందుకు 6వ తేదీ ఉదయం 11 వరకు సమయం ఇవ్వాలని అభ్యర్థించాడు. ఈమేరకు గురువారం ఉదయం 7.59 నిమిషాలకు పవన్ సెల్ నుంచి మెసేజ్ వచ్చింది. డబ్బులు సాంకేతిక కళాశాల వద్ద ఉన్న నిర్మానుష్య ప్రదేశంలో అందజేయాలని తెలిపాడు. ఈ విషయాన్ని బాధితుడు పీఎం పాలెం పోలీసులకు చెప్పగా వారు చాకచక్యంగా వ్యవహరించి, బాధితుడు పవన్‌కు డబ్బులిచ్చే సమయంలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి రూ. 2. 40 లక్షల నగదు, కారు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. కాగా తనకు అప్పులు తీర్చే మార్గం తెలియక ఈ బెదిరింపునకు పాల్పడినట్టు నిందితుడు తెలిపారు.

ప్రజాగ్రహం

... 5వ పేజీ తరువాయి

ఇబ్బందులకు గురిచేశారు. రెండేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు టీడీపీ కూటమి గెలవగానే ధైర్యంగా వెళ్లి అక్కడి రోడ్డు బ్లాక్స్‌ను తొలగించేందుకు యత్నించారు. వారికి తెలుగుదేశం, జనసేన నాయకులు కూడా తోడయ్యారు. అయితే ఉన్నతాధికారులకు లేఖ ఇస్తే తామే తొలగిస్తామని పోలీసులు సర్ది చెప్పి, అక్కడ తాత్కాలికంగా స్టాపర్లు ఏర్పాటు చేశారు.

తాజాగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రక్షాళన అంటూ కొంతమంది మాజీ ప్రొఫెసర్లు, సిబ్బంది కలిసి గురువారం అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. వైస్ ఛాన్సలర్ ప్రసాదరెడ్డి విశ్వవిద్యాలయాన్ని వైసీపీ కార్యాలయంగా మార్చేశారనే విమర్శలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. జీవీఎంసీ ఎన్నికల సమయంలో టికెట్ల కేటాయింపు నుంచి వివిధ కార్పొరేషన్లలో పదవులకు నాయకుల ఎంపిక వరకు అన్ని పనులు విశ్వవిద్యాలయం వేదికగానే నిర్వహించారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంకా నిబంధనలకు విరుద్ధంగా నియా మకాలు చేపట్టారు. ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో విద్యా సంస్థల ప్రతినిధులను ఆహ్వానించి సమావేశాలు నిర్వహిస్తూ మీడియాకు దొరికిపోయారు. గత ఐదేళ్లుగా వైసీపీ కోసం సర్వేలు, సమావేశాలు నిర్వహించిన వర్సిటీ పాలకులు...ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారంటూ సెలవులో ఉన్న అసోసియేట్ ప్రొఫెసర్ లావణ్య (గాజువాక టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు భార్య)ను సస్పెండ్ చేశారు. తాము చేస్తే ఒప్పు...ఇతరులు చేస్తే తప్పు అన్నట్టుగా వ్యవహరించిన పాలకుల చర్యలను నిరసిస్తూ విద్యార్థి సంఘాలు ఏయూ ప్రాంగణంలో నినదించాయి.

ఆ రెండింటిని ప్రక్షాళన చేయాల్సిందే

వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌ను రాజకీయ క్రీడా వేదికగా మార్చేసింది. కార్యవర్గాన్ని అడ్డగోలుగా వైసీపీ కీలక నేతల బంధువులు, అనుచరులతో నింపేసింది. అసోసియేషన్ ఎన్నికల్లో ఎవరూ పోటీ చేయకూడదని పరోక్షంగా హెచ్చరికలు పంపింది. క్రీడాకారుల విషయంలోను రాజకీయ నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పుడు క్రీడాభిమానులంతా ఈ రాజకీయ నియామకాలకు స్వస్తి చెప్పి గతంలోలా క్రీడాభివృద్ధికి తోడ్పాటు అందించే వారినే అసోసియేషన్‌లో నియమించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏపీ ఫిల్మ్ క్లబ్‌లోను అదే పరిస్థితి

వాల్తేరు క్లబ్‌లో జొరబడడానికి యత్నించి విఫలమైన వైసీపీ నేతలు తిమ్మాపురంలో ఉన్న ఏపీ ఫిల్మ్ క్లబ్‌ను అడ్డగోలుగా చెరబట్టారు. అప్పటివరకు కీలకంగా ఉన్న సినిమా రంగానికి చెందిన వారిని పక్కకు తప్పించి వైసీపీ భజనపరులను అందులో చొప్పించారు. క్లబ్ సభ్యత్వం రూపేణా సమకూరిన కోట్లాది రూపాయలతో భూమి కొనుగోలుకు ప్రయత్నం చేశారు. నాలుగు నెలల క్రితమే ఏకపక్ష ఎన్నికలు నిర్వహించి, అదే కార్యవర్గాన్ని పునరుద్ధరించుకున్నారు. దీనిపై కూడా దృష్టి పెట్టాలనే వాదన వినిపిస్తోంది.

ఏయూలో విగ్రహం మాటేమిటో?

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటు చేయించారు. ఇదంతా గత ఏడాది జూలైలో జరిగింది. విగ్రహానికి అంతా పూలమాలలు వేసి నివాళులు అర్పించేందుకు వీలుగా చుట్టూ రెయిలింగ్ నిర్మించారు. ప్రసాదరెడ్డి వీసీ అయినప్పటి నుంచి వైఎస్ జయంతి, వర్ధంతి సందర్భంగా కార్యక్రమాలు నిర్వహించేవారు. జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు నాడు ఆ విగ్రహం ముందే కేక్ కట్ చేసేవారు. వాటిపై పత్రికల్లో వార్తలు వచ్చినా పట్టించుకునేవారు కాదు. వైసీపీ కోసం పనిచేసిన వీసీని సాగనంపడంతో పాటు క్యాంపస్‌లో వైఎస్ విగ్రహాన్ని తొలగించాలని విద్యార్థి సంఘాలు ప్రతినిధులు, టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

'ఫ్రీ హోల్డ్'లో సిబ్బంది బలి!

... 5వ పేజీ తరువాయి

ఎకరాలకు ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్ అనుమతులు మంజూరుచేసిన విషయం 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకురావడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆనందపురం తహసీల్దార్ హేమంతకుమార్, ఇతర సిబ్బంది గురువారం భూమిని పరిశీలించారు. అనంతరం విచారణ నివేదిక రూపొందించినట్టు తెలిసింది. ఒక సర్వే నంబరులో భూమి ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ మంజూరు కోసం ప్రతిపాదనలు సంబంధిత వీఆర్వో నుంచి తీసుకుంటారు. ఇంకా మండల రెవెన్యూ కార్యాలయంలో ఉన్న రికార్డులు, ఆన్‌లైన్‌లో ఉన్న వివరాలను పరిశీలించిన తరువాతే ఆ ప్రతిపాదనలపై తహసీల్దారు సంతకం చేసి ఆర్డీవోకు పంపించాలి. విచిత్రం ఏమిటంటే రామవరం సర్వే నంబరు 164-3లో 1.53 ఎకరాలను ఇళ్ల పట్టాలకు కేటాయించిన విషయం ఆనందపురం తహసీల్దారు కార్యాలయ రికార్డుల్లో ఉంటుంది. అయినప్పటికీ ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్ మంజూరుకు ఎలా సిఫారసు చేయాల్సి వచ్చిందనే వివరాలు విచారణ నివేదికలో పేర్కొనలేదు. దీనిపై భీమిలి ఆర్డీవో, జిల్లా కలెక్టర్ మరింత లోతుగా విచారణ చేపట్టి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని రామవరం గ్రామస్థులు కోరుతున్నారు. దీనికి అనుగుణంగానే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

వైసీపీ ఆఫీస్ సిబ్బందికి జీతాలు నిల్

... 5వ పేజీ తరువాయి

సుబ్బారావుకు అప్పగించారు. ఆయన వ్యక్తిగత కారణాలతో పార్టీ కార్యక్రమాలకు ఇటీవల హాజరుకావడం లేదు. దాంతో సిబ్బందికి జీతాలు లేవు. ఈ విషయాన్ని ఉత్తరాంధ్ర పార్టీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి దృష్టికి తీసుకువెళ్లినా పెద్దగా పట్టించుకోలేదు. నాలుగు రోజుల నుంచి కార్యాలయానికి ఎవరూ రావడం లేదు. రెండు నెలలుగా జీతాలు లేవని, తమ పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదని కార్యాలయ సిబ్బంది వాపోతున్నారు. పార్టీ కార్యాలయానికి సెంట్రల్ ఆఫీసు ఒక మేనేజర్‌ను నియమించింది. ఆయనకు కూడా మూడు నెలలుగా జీతం ఇవ్వలేదని తెలిసింది. పార్టీ అధికారంలో ఉంటే ఈరోజు కాకపోతే రేపు అయినా ఇస్తారనే నమ్మకం పని వారిలో ఉండేది. ఇప్పుడు పార్టీ ఓడిపోవడం, నాయకులు ఎవరూ కార్యాలయం ముఖం చూడకపోవడంతో వారు లబోదిబోమంటున్నారు. జీతాలే కాకుండా టీ, కాఫీల కోసం తీసుకున్న పాలకు చెల్లించాల్సిన బిల్లులు కూడా పెండింగ్ ఉండిపోయాయి. ఈ భవనానికి మార్చి నెల వరకూ బిల్డర్ విద్యుత్ బిల్లు చెల్లించేవారు. అప్పగించేసిన తరువాత పార్టీయే కట్టుకోవలసి ఉంది. ఏప్రిల్ నుంచి ఆ బిల్లు కూడా చెల్లించలేదని తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

మల్కాపురం, జూన్ 7: మల్కాపురం పోలీసు స్టేషన్ పరిధి పోర్టురోడ్డు మారుతి జంక్షన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి రోడ్డుప్రమాదానికి గురై మృతి చెందిన సంఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. ఈ మార్గంలో సైకిల్‌పై వెళ్తుండగా లారీ వచ్చిబలంగా ఢీ కొన్నడంతో సదరు వ్యకి తీవ్రగాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. ముఖం గుర్తుపట్టని విధంగా ఉంది. మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'త్యాగాలతో ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకుంటాం'



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఉక్కు ఉద్యోగులు

కూర్మన్నపాలెం, జూన్ 7 : త్యాగాలతో ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుంటామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. కూర్మన్నపాలెంలో పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 1212 రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన దీక్షా శిబిరంలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వరంగాలపై కేంద్ర ప్రభుత్వానికి కక్షసాధింపు తగదన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయాలనుకున్న కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వలన 70 శాతం మంది ప్రజలు ఉపాధి కోల్పోనున్నారన్నారు. కూటమి పరిరక్షణతో ఉక్కు పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉక్కు ఉద్యోగులు పాల్గొన్నారు.

రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలి

ద్వారకా బస్‌స్టేషన్, జూన్ 7 : ప్రయాణికులకు రవాణా సౌకర్యాలతో పాటు లాజిస్టిక్స్ బిజినెస్ కూడా మెరుగుపరచాలని ఆర్టీసీ విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చింతా రవికుమార్ సూచించారు. శుక్రవారం ఆయన ఎంవీపీ కాలనీలోని ఈడీ క్యాంప్ కార్యాలయంలో డిపో మేనేజర్లు, కమర్షియల్ ఎగ్జిక్యూటివ్‌లు, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ ప్రయాణికులకు రవాణా సేవలందించే ఆర్టీసీ బస్సులన్నీ ఫిట్‌గా ఉండాలని, అందుకు ఎప్పటికప్పుడు వాటిని సాంకేతిక విభాగం అధికారులు, సిబ్బందితో చెక్ చేయించాలని చెప్పారు. మెకానికల్, ఎలక్ట్రికల్, బాడీ విభాగాలు సరిచూసుకోవాలన్నారు. కమర్షియల్‌కు సంబంధించి, పార్శిల్ రవాణా ఆదాయాన్ని పెంచాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తులు, యంత్రాల విడిభాగాలు, వంటి రవాణాను ప్రమోట్ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్టీసీ విజయనగరం జోన్ డిప్యూటీ చీఫ్ ట్రాఫ్ మేనేజర్ (కమర్షియల్ అండ్ ఆపరేషన్స్) బి. అప్పలనాయుడు, మన్యం జిల్లా రవాణా అధికారి శ్రీనివాసరావు, డిపో మేనేజర్లు, బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల పిల్లల గుర్తింపు

మల్కాపురం, జూన్ 7 : ములగాడ మండలంలో చేపడుతున్న 18 ఏళ్ల లోపు బ యట ఉన్న విభిన్న ప్రతిభావంతుల గుర్తింపు నమోదు కార్యక్రమాన్ని జిల్లా సహిత విద్య సమన్వయకర్త గీత గురువారం పర్యవేక్షించారు. దివ్యంగుల పిల్లకు భవిత కేంద్రాల ద్వారా అందిస్తున్న చదువు, ఫిజియో థెరపీ సేవలు, ప్రభుత్వ పరంగా వచ్చే ఉపకార వేతనాలు, ఇతర రాయితీల వివరాలను పిల్లల తల్లిదండ్రులకు ఆ మె వివరించారు. ఈ సర్వేలో ఇప్పటి వరకు 21 మంది బాలలను గుర్తించి వారి వివరాలను నమోదు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎల్. వెంకట్రావు, ఏపీవో అప్పలనాయడు, సీఆర్పీ కృష్ణారావు, ప్రత్యేక ఉపాధ్యాయులు బాలకృష్ణ నాయుడు, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీవారికి పంచామృతాభిషేకం

పెందుర్తి, జూన్ 7: పెందుర్తి వెంకటాద్రి శిఖరంపై కొలువైయున్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మూలవిరాట్టు విగ్రహానికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామి విగ్రహం ఆపాదమస్తకం పాలు, పెరుగు, నెయ్యి, నీరు, తేనె సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వామిని వజ్రాలంకరణ చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పెదగంట్యాడ, జూన్ 7 : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మ్యాజిక్ బస్ ఇండియా సంస్థ ట్రైనింగ్ అండ్ మాటరింగ్ ఆఫీసర్ సురేంద్రకుమార్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం బాబూ జగజ్జీవన్‌రామ్ కాలనీలో ఆ సంస్థ సభ్యులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఏటా తమ పుట్టిన రోజున ఒక మొక్కను నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది నాగమణి, మెహరున్నీసా, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **సత్యభామ :** సంగం, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), శ్రీహరిపురం (ఎస్.వి.సి.లిఖిత)
- **లవ్ మౌళి :** శారద, లక్ష్మీ (గాజువాక)
- **గోల్డ్ నెం.1 :** శ్రీకాంతి
- **గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి :** శరత్, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గం గం గణేశా :** శ్రీవెంకటేశ్వర, సౌజన్య (గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ), గణేష్ (తగరపువలస)
- **భజే వాయు వేగం :** మెలోడి, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), తాతా (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి)
- **లవ్‌మీ :** గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 28, టమాటా 48, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 28, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 40, బీరకాయలు 40, అనపకాయలు 24, కాలీఫ్లవర్ 42, క్యాబేజ్ 25, క్యారెట్ 25, దొండకాయలు 22,బంగాళదుంపలు 28, అరటికాయ (పె) 6, మునక్కాడలు (కిలో) 58, అల్లం (పాతది) 156, బరబాటి 40, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 38, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 110, పొటల్స్ 38, కీరదోస 26, కాప్సికమ్ 72, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 36, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడిఅల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	455
విజయనగరం	459
శ్రీకాకుళం	459

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	125
ఫారం ధర	--	145
విత్ స్కిన్	--	260
స్కిన్‌లెస్	--	270

కేజీహెచ్‌కు సీఎస్ఆర్ నిధులు

- రూ.20 కోట్లతో వార్డులు, క్యాజువాల్టీల్లో సదుపాయాలు
- మరో రూ.10 కోట్లతో సంక్షేమ వసతి గృహాల్లో సదుపాయాలు
- సజావుగా ఎన్నికల ప్రక్రియ
- పాత్రికేయుల సహకారం మరువలేనిది
- కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున



ఫ్లోటింగ్ వద్ద కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్, జేసీ మయూర్ అశోక్

విశాఖపట్నం,జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వివిధ పరిశ్రమలు, వ్యాపార సంస్థలు సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) కింద అందించిన నిధుల నుంచి సుమారు రూ.30.82 కోట్లు వెచ్చించి కేజీహెచ్, సంక్షేమ వసతి గృహాలు అభివృద్ధి చేశామని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేలాది మందికి వైద్యం అందించే కేజీహెచ్‌లో రూ.18 కోట్లతో అనేక వార్డులు, క్యాజువాల్టీల్లో మౌలిక వసతులు కల్పించామన్నారు. ఎంఆర్ఐ, సీటీ స్కాన్ ఇతర పరీక్షలకు కొత్త మిషనరీ తెప్పించామని, రోగుల కోసం బ్యాటరీ వాహనాలు సమకూర్చామన్నారు. హెచ్‌పీసీఎల్ సహకారంతో రూ.రెండు కోట్లతో బర్న్స్ వార్డును ఆధునికీకరించడానికి ప్రతిపాదించామన్నారు. అలాగే సాంఘిక, బీసీ సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న 23 వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన మేరకు పూర్తిస్థాయి వసతుల కల్పనకు రూ.10.82 కోట్లు ఖర్చు చేశామన్నారు. జిల్లాలో పేదలకు వైద్యం, ఇతరత్రా సాయం అందించడానికి సంజీవని నిధి ఏర్పాటుచేశామన్నారు. భవిష్యత్తులో ఆదాయం పెంచుకునేందుకు యంత్రాంగం ఆధ్వర్యంలో నాలుగు పెట్రోల్ బంకులు ఏర్పాటుచేస్తామన్నారు.

గత ఏడాది చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ నుంచి మూడు రోజుల క్రితం ముగిసిన ఎన్నికల ప్రక్రియ వరకు అంతా సజావుగా సాగిందని కలెక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. ఎక్కడైనా లోపాలు ఉంటే పత్రికలు వెంటనే వెలుగులోకి తీసుకురావడంతో చర్యలు తీసుకునేందుకు ఆస్కారం ఏర్పడిందన్నారు. ఎన్నికల నిర్వహణలో ఓటర్లు, అన్ని పార్టీల నేతలు, అధికారులు, సిబ్బంది సహకరించారన్నారు. ముఖ్యంగా జర్నలిస్టుల సహకారం మరువలేనిదని కొనియాడుతూ ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సమాజానికి అన్ని విధాలుగా సేవలు అందిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి జిల్లా యంత్రాంగం తరపున అనేక విధాలుగా కృషిచేశామని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. గత ఏడాది జర్నలిస్టులకు ఆరోగ్య బీమా ప్రీమియం చెల్లించామని, ఉచిత వైద్యపరీక్షలు చేపట్టామన్నారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి అపోలో ఆస్పత్రిలో జర్నలిస్టుతోపాటు జీవిత భాగస్వామికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించారు. దీనికి సంబంధించి జిల్లా పౌర సంబంధాల అధికారి షెడ్యూల్ ఖరారు చేస్తారన్నారు. జర్నలిస్టులకు వచ్చే ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఆరోగ్య బీమా ప్రీమియం చెల్లించేందుకు నిధి ఏర్పాటుచేశామని తెలిపారు. అర్హులైన పాత్రికేయులకు ఇళ్ల స్థలాలకు రెండు, మూడు చోట్ల భూమి గుర్తించి రేటు ఖరారుచేశామన్నారు. అయితే కొత్త ప్రభుత్వం విధానాలకు అనుగుణంగా ఇళ్ల స్థలాలకోసం కార్యాచరణ రూపొం దిస్తామన్నారు. సిటీ పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యనార్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో మీడియా ప్రశంసనీయమైన పాత్ర పోషించిందన్నారు. విలేకరుల సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, నియోజకవర్గ ఆర్వోలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, లక్ష్మారెడ్డి, అఖిల, శేషశైలజ, సీతారామమూర్తి, డీపీఆర్వో ఎస్వీ రమణ పాల్గొన్నారు.

ఆక్రమణలతో గెడ్డలు కుదింపు

- ముంపు సమస్యతో నిర్వాసిత కాలనీలు

కూర్మన్నపాలెం, జూన్ 7: గెడ్డలపై ఆక్రమణల పుణ్యమా.. అని పెద్ద కాలువలు కుంచించుకుపోతున్నాయి. మురుగు ముందుకు పారే పరిస్థితి లేక ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. మొన్నటి వరకు 25 నుంచి 30 అడుగుల వెడల్పుతో ఉండే గెడ్డలు ఇప్పుడు కేవలం ఐదు నుంచిపది అడుగులతో కనిపిస్తున్నాయంటే ఎంత మేర ఆక్రమణలకు గురవుతున్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. వడ్లపూడిలోని చాకలిగెడ్డ, కృష్ణుడి గుడి వద్దనున్న ప్రధాన గెడ్డలు చూస్తే మరీ ఆశ్చర్యం వేస్తుంది. ఇక్కడ ఆక్రమలు జోరందుకున్నాయి. అయినప్పటికీ జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడకపోవడం విశేషం. ఫలితంగా చిన్నపాటి వర్షాలకూ ముంపు సమస్య తలెత్తుతోంది. ఇక్కడ గెడ్డలను ఆనుకొని సుమారు 46 కాలనీలు ఉన్నాయి. గెడ్డలపై ఆక్రమణలు చేపట్టిన పలువురు అంతటితో ఆగక పక్కా నిర్మాణాలను సైతం ఇష్టారాజ్యంగా చేపడుతున్నారు. ఒకరిని చూసి మరొకరు ఆక్రమించుకోవడంలో పోటీలు పడుతున్నారు.



పాత వడ్లపూడి, కణితిలలో మురికి గెడ్డను ఆనుకొని ఉన్న అక్రమ నిర్మాణాలు

ఈ ఆక్రమణల తొలగింపులో అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండడంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా ఇటువంటి ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కాలనీ వాసులు కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంటులో గుర్తింపు యూనియన్ ఎన్నికలు నిర్వహించాలి

- ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 7 : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో గుర్తింపు యూనియన్ ఎన్నికలు నిర్వహించేందుకు యాజమాన్యం ముందుకు రావాలని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. ప్లాంట్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుత గుర్తింపు యూనియన్ అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు కార్మికుల సంక్షేమానికి ఏమీ చేయలేదని ఆరోపించారు. ఇంటక్ గుర్తింపులో ఉన్న సమయంలో చేసిన కార్మిక సంక్షేమం తప్ప, నేటివరకు కార్మికులకు ఏమి చేయలేదన్నారు. ఉన్న వాటిని తీసేసిన ఘనత వామపక్షాలు చెందుతుందని విమర్శించారు. కార్మిక సంక్షేమం విషయంలో ఇంటక్ రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. ఉక్కు పరిరక్షణకు నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, నాయకులు కారు రమణ, అప్పలస్వామి, బీఎస్‌రాజు, కొమ్ము ప్రసాద్, గోపాల్‌రాజు, జి.ప్రభాకర్‌రెడ్డి, నాయుడు, డి.మోహన్, కొవిరి అవతారం, బీఎంకే నాయక్, రమణమూర్తి, మంత్రి గోపీ నారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్

బస్ షెల్టర్ లేక డివైడర్‌పై ప్రయాణికుల నిరీక్షణ



గోపాలపట్నం రైల్వే స్టేషన్ కూడలిలో డివైడర్‌పై నిరీక్షిస్తున్న ప్రయాణికులు

గోపాలపట్నం, జూన్ 7 : గోపాలపట్నం రైల్వే స్టేషన్ కూడలిలో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులకు రక్షణ కరువైంది. దశాబ్దాల కాలంగా ఇ క్కడ బస్టాపు ఉన్నప్పటికీ షెల్టర్ నిర్మాణం చేపట్టక పోవడంతో నిత్యం ఈ కూడలిలో ప్రయాణీకులు భయాందోళనకు గురవుతున్నారు. షెల్టర్‌లేక బస్సుల కోసం ప్రయాణీకులు రోడ్డు మధ్యలోని డివైడర్‌పై నిల్చొని ఎండైనా, వానైనా వేచి ఉంటున్నారు. ఈ సమయంలో బీఆర్‌టీఎస్‌పై, సర్వీస్‌రోడ్డులో వేగంగా వచ్చే వాహనాలు ఎవరిని ఢీకొని ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భ యపడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. ప్రయాణీకులు కనీసం రోడ్డుపై నిల్చునేందుకు కూడా స్థలం లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వేల సంఖ్యలోవచ్చిపోయేఈ కూడలిలో షెల్టర్ నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

స్పీడ్ బ్రేకర్లు లేక ప్రమాదాలు



స్పీడు బ్రేకర్లు లేని నాగేంద్రకాలనీ ప్రధాన రహదారి

గోపాలపట్నం, జూన్ 7: రహదారులపై వాహన చోదకులు మితిమీరిన వేగంతో ప్ర యాణం చేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధానంగా 89వ వార్డు పరిధిలోని కొత్తపాలెం, నాగేంద్రకాలనీ, సంతోష్‌నగర్ కాలనీల్లో సువిశాలంగా రహదారుల నిర్మాణం చేపట్టారు. కానీ, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాహన చోదకులు వేగంగా వెళ్తుండడంతో వాహనదారులతోపాటు పాదచారులు ప్రమాదాలకు లోనవుతున్నారు.ఇలానే, అతివేగం వల్ల ఇటీవల ఇద్దరు చిన్నారులు తీవ్రగాయాల పాలయ్యారు. అయితే దీనిపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోపోవడంతో ప్రమాదాలు పరిపాటిగా మారాయి.

ఈఎస్ఐ ఆస్పత్రికి సమస్యల సుస్తీ

- పేరుకు మాత్రమే ల్యాబ్.. వైద్య పరీక్షలు నిల్
- నిలిచిపోయిన సర్జికల్ ఇన్‌ప్లాంట్స్ సరఫరా
- రోగులకు అందని పూర్తిస్థాయిలో సేవలు



మల్కాపురం, జూన్ 7 : ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ప్రైవేట్ పరిశ్రమలు, సంస్థల కార్మికుల ఆరోగ్య కల్పవల్లి ఈఎస్ఐ ఆస్పత్రిలో అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. సమస్యల పరిష్కరించడంలో ఈఎస్ఐ డైరెక్టర్లు కానీ, సంబంధిత అధికారులు కానీ కనీసం స్పందించడం లేదు. దీంతో ఏళ్ల తరబడి ఆస్పత్రి అభివృద్ధి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ప్రధానంగా గతంలో ఈఎస్ఐ ఆస్పత్రుల మందుల కొనుగోలులో అవినీతి చోటుచేసుకుందని భావించి ఈ ఆస్పత్రుల్లో అన్ని రకాల రక్తపరీక్షలు నిలుపు చేశారు. ఫలితంగా ప్రస్తుతం ఈ ఆస్పత్రిలో ఉన్న ల్యాబ్ అలంకారప్రాయంగా మారింది. ప్రస్తుతం ఈ ల్యాబ్‌లో షుగర్ టెస్ట్‌లు, కిడ్నీ వ్యాధికి టెస్ట్‌లు మాత్రమే జరుగుతున్నాయి. మిగతా పరీక్షలను రోగులు బయట ల్యాబ్‌ల్లో చేయించుకుంటున్నారు. ఇక్కడి ల్యాబ్‌లో టీసీడీసీ, టైఫాయిడ్, మలేరియా, హెచ్ ఐవీ, హెచ్‌సీవీ, హెచ్‌బీఎస్ఏజీ, ఎల్ఎఫ్‌టీ పరీక్షలు జరగడం లేదు. దీంతో ఈ పరీక్షలకు ఆస్పత్రికి వచ్చేవారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ ఆస్పత్రిలో ఉన్న ల్యాబ్‌లకు సంబంధించి అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ వైద్య పరీక్షలను చేసేందుకు ఉపయోగించే మందులు లేవు. అలాగే, సర్జికల్ ఇన్‌ప్లాంట్స్ అందుబాటులో ఉంచడంలేదు. కొన్నేళ్లుగా వీటి సరఫరా నిలిపివేశారు.

డైట్ సరఫరాలో సమస్య

అంతేకాకుండా డైట్ సమస్య కూడా ఉంది. ఆస్పత్రి పునఃప్రారంభమై ఏళ్ల గడుస్తున్నా ఇన్‌పేషెంట్లకు డైట్ అందడం లేదు. ఇటీవలే డైట్ అందిం చేందుకు టెండరు ఆహ్వానించారు. ఉదయం పూట టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి డిన్నర్, సాయంత్రం సమయంలో టీ అందించేందుకు రూ.80 చొప్పున నిర్దేశించారు. గతంలో ఇదే మెనూతో టెండర్‌ను గతంలో ఆహ్వానించినప్పటికీ ఎవరూ ముందుకు రాలేదు. ఇప్పుడు మళ్లీ తాజాగా మరోసారి ఆహ్వానిస్తున్నారు. ఈఎస్ఐ ఆస్పత్రిలో 224 మంది స్టాఫ్ ఉండాల్సి ఉండగా, కేవలం 89 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఈస్టాఫ్‌తోనే కొన్నేళ్లుగా ఆస్పత్రి నడుస్తోంది. సిబ్బందిని వెంటనే నియమించాలని చేయాలని పలువురు కోరుతున్నారు. సంబంధిత అధికారులు ఈవిషయంలో వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని ఈఎస్ఐ కార్డు దారులు కోరుతున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

మల్కాపురం, జూన్ 7 : చిన్నారులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి పేర్కొన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహించి వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. ఈసందర్భంగా నిర్వహించిన కార్య క్రమంలో ఆ మె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. చిన్నారులు గ్రంథాయాలను ఉపయోగించుకొని జ్ఞానాన్ని పెంపొందించుకోవాల న్నారు. సమావేశంలో షిప్‌యార్డు రచయితల సంఘం ప్రతినిధి , చిత్రకళా పరిషత్ అధ్యక్షుడు సంకర చలపతిరావు, సెయింట్ ఆన్స్ కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, రచయిత సత్తిరాజు, కార్మిక నాయుడు సత్యానందం, చిత్రకారుడు ద్వారపూడి శ్రీనివాస్ మనోహర్, సెంట్రల్ డిప్యూటీ లైబ్రేరియన్ నూకరాజు, ఎన్ఎస్ఐ జిల్లా ప్రోగ్రామ్ అధికారి భాగ్యలక్ష్మీ, గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ పాల్గొన్నారు.

విజ్ఞాన సముపార్జనలో పోటీతత్వం ఉండాలి

పెదగంట్యాడ, జూన్ 7 : విజ్ఞాన సముపార్జనలో విద్యార్థుల మధ్య పోటీ తత్వం ఉండాలని జీవీఎంసీ 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అన్నారు. విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు వేసవి శిక్షణా శిబిరాలు ఎంతగా ఉపయోపడతాయన్నారు. పెద గంట్యాడ శాఖా గ్రంథాలయంలో 15 రోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో కూడా ముందుండాలని సూచించారు. నడుపూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ నిరంతరం చదువు ధ్యాసతో ఉండే విద్యార్థులకు క్రీడలు మరింత వికాసాన్ని కలిగిస్తాయన్నారు. క్రీడారంగంలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులు క్రీడారంగంలో రాణించేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. వేసవి శిక్షణాశిబిరం నిర్వాహణలో భాగంగా క్రికెట్, ఖోఖో, రింగ్‌టెన్నీస్, చెస్, క్యారమ్స్ తదితర పోటీలు నిర్వహించారు.

'పల్లా'కు అభినందనల వెల్లువ



పల్లా శ్రీనివాసరావును అభినందిస్తున్న శిష్టకరణ సాధికారిక సమితి ప్రతినిధుల

గాజువాక, జూన్ 7: రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన పల్లా శ్రీనివాసరావును గాజువాక శిష్టకరణ సాధికార సమితి ప్రతినిధులు శుక్రవారం అభినందించారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి గాజువాక ప్రజలు ఓ మంచి వ్యక్తిని ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారని, త్వరలో మంత్రి కావాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బలివాడ సత్యారావు, ప్రతినిధులు ప్రతాప్‌రావు, శ్రీనివాసరావు, బాసంగి తిరుపతిరావు, కరకవలస గౌరీప్రసాదరావు, నాగుమంత్రి వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అగనంపూడిలో.. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును శుక్రవారం అగనంపూడి ప్రాంత నాయకులు అభినందించారు. 79వ వార్డు తెలుగు మహిళ ప్రతినిధి గొల్లవిల్లి కనకభవానీ ఆధ్వర్యంలో పల్లాకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గొల్లవిల్లి వెంకటరావు, పండురు సూర్య, సూరమ్మ, కనక, సంజీవ్, సత్య, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

శ్రీనగర్‌లో.. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును శుక్రవారం శ్రీనగర్ టీఎస్సార్ టీబీకే కళాశాల చైర్మన్ తలశిల బలరామకృష్ణ, కరస్పాండెంట్ తలశిల ఉమా మహేశ్వరరావు అభినందించారు. ఈ సందర్భంగా బలరామకృష్ణ మాట్లాడుతూ సౌమ్యుడు, అందరివాడు పల్లా విజయం సాధించడం హర్షణీయమన్నారు.

దుర్గమాంబ ఆలయంలో విశేష పూజలు

అగనంపూడి, జూన్ 7 : జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారిని విశేషంగా అలంకరించిన అనంతరం కుమార్చనలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు ఆలయంలో లలితా పారాయణం, విష్ణుసహస్ర నామా పారాయణాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మెన్ చిత్తా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు తదితరులు పాల్గొన్నారు.



గాజువాకలో టీడీపీకి ఓట్ల సునామీ : బొండా



సమావేశంలో మాట్లాడుతున్న బొండా జగన్

కూర్మన్నపాలెం, జూన్ 7 : సార్వత్రిక ఎన్నికల్లో గాజువాకలో ఓట్ల సునామీ జోరుకు ఫ్యాన్ రెక్కలు విరిగిపోయాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. జీవీఎంసీ 87 వార్డు వడ్లపూడి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కూటమికే అక్కా చెల్లెమ్మలు ఓట్లు వేసి భారీ మెజారిటీ ఇచ్చారన్నారు. గాజువాక అభివృద్ధి ఒక్క పల్లాతోను సాధ్యమని ప్రజలంతా నమ్మినట్టు చెప్పారు. ఈ సమావేశంలో విజయరామరాజు, సత్తిబాబు, రాజన్‌రాజు, శ్రీనివాస వర్మ, పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

అగనంపూడి, జూన్ 7 : ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు స్థానిక ఆస్వాన్ పాపారావు చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించారు. ప్రోత్సాహక నగదు బహమతులతో పాటు నోట్ పుస్తకాలు, జామెంటరీ బాక్సులు, నిఘంటువులను క్లబ్ జిల్లా గవర్నర్ యలమర్తి నరసింగరావు చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవి క్లబ్ సేవలను వివరించారు. క్లబ్ అధ్యక్షుడు మయూరి బుజ్జి, గణేశ్, గురుమూర్తి, సత్తిబాబు, గున్నయ్యశెట్టి, రామకృష్ణ, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

'కూటమి విజయం... ప్రజా విజయం'



ఎన్టీఆర్‌కు విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

పెందుర్తి, జూన్ 7: కూటమి విజయం ప్రజావిజయం అని జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి అత్యధిక స్థానాలు సాధించిననేపథ్యంలో శుక్రవారం పెందుర్తిలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా పెందుర్తిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పీలా పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పీలా మాట్లాడుతూ చంద్రబాబు సీఎం ఎపీకి మహర్దశ పడుతుంన్నారు. ఈ కార్యక్రమంలో వేగి పరమేశ్వరరావు ,గొర్లె రామునాయుడు పాల్గొన్నారు.

గ్రంథాయాలు విజ్ఞాన భాండాగారాలు : సీఐ

పెందుర్తి, జూన్ 7: స్థానిక శాఖా గ్రంథాలయంలో నెలరోజులకుపైగా నిర్వహించిన వేస శిబిరం శుక్రవారం ముగిసింది. శు క్రవారం నిర్వహించిన కార్యక్రమానికి సీఐ ఎల్ రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయాలు విజ్ఞాన వీచికలన్నాఅనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. శిక్షణ శిబిరంలో సహకరించిన గురువులు,శిక్షకులను సత్కరించి జ్ఞాపికలు అందించారు. ముందుగా గ్రంథాలయ ప్రాంగణంలో గల గాంధీ విగ్రహానికి జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు నివాళులు అర్పంచారు. గ్రంథాలయాధికారి సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో డీఆర్‌సీ మాల్ అధినేత దాడి రమణ చిట్టి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వేగి దివాకర్, గ్రంథాలయ కమిటీ కార్యదర్శి ఆడారి రామకృష్ణ పాల్గొన్నారు.


ప్రజలు చంద్రబాబును నమ్మారు : పల్లా



దుర్గాదేవి ఆలయం ఎదుట టెంకాయలు కొడుతున్న పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ, జూన్ 7 : ప్రజలు చంద్రబాబునాయుడును నమ్మారని, అందుకే ఆయనకు అఖండ విజయం ఇచ్చారని గాజువాక ఎమ్మెల్యేగా ఎన్నికైన పల్లా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధి బర్మాకాలనీ లోని దుర్గాదేవి అమ్మవారి ఆలయం ఎదుట 101 టెంకాయలు కొట్టి మొక్కుతీర్చుకున్నారు. అనంతరం దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రగతికోసం నిరంతరం పరిశ్రమించే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావలసిన అవసరాన్ని రాష్ట్ర ప్రజలు గుర్తించారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో తెలుగుదేశం,జనసేన, బీజేపీ పార్టీలు ఇచ్చిన హామీలన్నింటిని అమలు పరిచేందుకు నూతన ప్రభుత్వం శక్తి వంచన లేకుండా కృషిచేస్తుందన్నారు. తెలుగుదేశం పార్టీపై ప్రజలు పెట్టుకున్న ఆశలన్నీ కార్యరూపంలోనికి వస్తాయన్నారు. ఈ కార్యక్రమానికి సార్థ్యం వహించిన జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గందం శ్రీనివాసరావు మాట్లాడుతూ పల్లా ఎన్నికైతే దుర్గామాతకు 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేస్తామని మొక్కుకున్నామని, ఇప్పుడు ఆ మొక్కును తీర్చుకున్నామన్నారు. కార్యక్రమంలో 76వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బాసెట్టి అప్పారావు, కార్యదర్శి తాటికొండ సుదర్శన్‌రావు, విశాఖ పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, 75వ వార్డు టీడీపీ అధ్యక్షుడు అప్పారావు, పాల్గొన్నారు.

ఆకర్షణీయమైన బోధనతోనే చిన్నారుల్లో వికాసం: ఆర్‌జేడీ



శిక్షణలో మాట్లాడుతున్న ఆర్జేడీ విజయభాస్కర్

కంచరపాలెం, జూన్ 7: ఆకర్షణీయమైన బోధనతో చిన్నారులకు వికాసవంతమైన విద్యనందించవచ్చునని జోన్-1 ఆర్జేడీ విజయభాస్కర్ పేర్కొన్నారు. నగరంలో రెండు రోజులుగా జరుగుతున్న ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) డీఆర్పీల శిక్షణ శిబిరాన్ని ఆయన శుక్రవారం సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో ఒకటి, రెండు తరగతుల ఉపాధ్యాయులు ఆటపాటలతో చిన్నారులను ఆకట్టుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు నిరంతరం నూతన పోకడలపై పట్టుసాధిస్తూ బోధనలో అన్వయించుకోవాలని సూచించారు. డీఈవో చంద్రకళ, ఏపీసీ శ్రీనివాసరావు శిక్షణ కరదీపిక, మూల్యాంకన కిట్‌ల వినియోగం, నిర్వహణపై వివరించారు. కోర్సు కో ఆర్డినేటర్ సమగ్ర శిక్ష ఏఎంవో డా.జి.లక్ష్మి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో 11 మండలాల నుంచి డీఆర్పీలు, ఎంఈవోలు రామారావు, బాలామణితోపాటు కీ రీసోర్స్ పర్సన్‌లు సోమయాజులు, హరికృష్ణ, రాజకిరణ్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

జగదాంబ కూడలి, జూన్ 7: గ్రంథాలయాల్లో పుస్తక పఠనం అలవరుచుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలుగు భాషా ఉపాధ్యాయుడు డి. సంజీవ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జగదాంబ సమీపంలో ఉన్న జిల్లా గ్రంథాలయంలో శుక్రవారం జరిగిన వేసవి విజ్ఞాన శిక్షణ ముగింపు కార్య క్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.పట్టుదలతో కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చునన్నారు. పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు అన్నిరకాల పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచామని గ్రంథాలయ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు పేర్కొన్నారు. సామాజిక కార్యకర్త కేవీఎస్ నరసింహం.గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని అన్నారు. ఈ సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, క్రాఫ్ట్ వర్క్ విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు.

యూడీజీ లీక్‌తో అవస్థలు



ఎల్లమ్మతోటలో లీకైన యూడీజీ లీకు

డాబాగార్డెన్స్, జూన్ 7: గ్రేటర్ 31వ వార్డులోని ఎల్లమ్మతోట సీపీఎం ఆఫీస్‌రోడ్డులో యూడీజీ లీకై రోడ్డుపైనే మురుగునీంతా ప్రవహిస్తోంది. దీంతో స్థానికులు, అటుగా రాకపోకలు సాగించేవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.దుర్వాసనకు ముక్కుమూసుకుని వెళ్లాల్సివస్తోందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి యూజీడీ లీకేజీ నివారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేకుంటే దోమలు వృద్ధి వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉందని ఆవేదనవ వ్యక్తం చేస్తున్నారు.





కేక్ కట్ చేస్తున్న నజీర్, నాయకులు



42వ వార్డులో విజయోత్సవాలు

కూటమి శ్రేణుల విజయోత్సవ రాలీలు

సీతమ్మధార, జూన్ 7: గ్రేటర్ 14వ వార్డులో వార్డు అధ్యక్షులు పి.వి. వసంత రావు, గొంప ధర్మరావులు ఆధ్వర్యంలో కూటమి అభ్యర్థులు ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు గెలుపొందడంపై విజయోత్సవాలను నిర్వహించారు. సీతమ్మధార అభయ అంజనేయస్వామి ఆలయం ఆర్టీ సమీపంలో కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ నాయకులు, సభ్యులు హరిత, ప్రసాద్, రాయుడు వెంకటరమణ,, వైకృష్ణ, జి.రాంబాబు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: విశాఖ నగరంలో కూటమి అభ్యర్థులు విజయం సాధించడంతో టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీని, గాజువాక ఎమ్మెల్యేగా విజయం సాధించిన పల్లా శ్రీనివాస్‌ను 42వ వార్డు అధ్యక్ష, కార్యదర్శులు కన్నం వెంకట రమణారావు, ముక్కి రామకృష్ణ శుక్రవారం కలిసి అభినందనలు తెలిపి మిఠాయిలు తినిపించారు. వీరిని కలిసిన వారిలో నాయకులు శ్రీకృష్ణ, ఎంఎల్ఎస్ రావు, దువ్వి కాశీప్రసాద్, జనపల కృష్ణ, బంగారి నవీన్ ఉన్నారు. సౌత్ ఎమ్మెల్యేగా వి జయం సాధించిన వంశీకృష్ణ శ్రీనివాస్‌కు 27వ వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి, అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దొండపర్తి పురవీధుల్లో ద్వారకానగర్, ఐఎస్‌టీ కాలనీ, భగత్‌సింగ్ కాలనీ, శ్రీనగర్, వినాయకనగర్, అశోక్‌నగర్, అమర్‌నగర్ తదితర ప్రాంతాల్లో బైక్ ర్యాలీ నిర్వహించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మీ శివ ప్రసా ద్, నాయకులు పీవీ రమణారావు, పాలికల సింహాచలం, బీపీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నార్త్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన పెనుమత్స విష్ణుకుమార్ రాజు, ఎంపీ శ్రీభరత్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించిన ప్రతి ఒక్కరికీ వార్డు అధ్యక్షుడు పుక్కళ్ల పైడికొండ ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ బూత్ ప్రెసిడెంట్లు, పాల్గొన్నారు.

‘జాక్వార్’ షోరూమ్ ప్రారంభం



రేసపువానిపాలెంలో షోరూమ్ ప్రారంభిస్తున్న సూర్య ఇంటర్నేషనల్ ఎండీ డాక్టర్ హరినాథ్‌బాబు

సీతమ్మధార, జూన్ 7: నగరంలోని న్యూ రేసపువానిపాలెంలో స్వర్ణభారతి స్టేడియం సమీపాన ‘జాక్వార్’ షోరూమ్‌ను శుక్రవారం సూర్య ఇంటర్నేషనల్ ఎండీ డాక్టర్ పి.హరినాథ్‌బాబు ప్రారంభించారు. సాయిబాలాజీ మార్కెటింగ్ లివింగ్ లైన్స్‌లో ఈ షోరూమ్‌ను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా హరినాథ్‌బాబు మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఈ షోరూమ్‌లో అన్ని మోడళ్లు/ రకాలు అందుబాటులో ఉంటాయన్నారు. అరవై ఏళ్ల చరిత్ర కలిగిన ‘జాక్వార్’ కంపెనీ ఉత్పత్తులను భారత్‌లో విక్రయించడంతో పాటు 66 దేశాలకు ఎగుమతి అవుతున్నట్టు వివరించారు. జాక్వార్‌లో షవరింగ్ క్లోజెస్, ప్యానల్స్, వర్ల్‌పూల్, స్పా, వాటర్ హీటర్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. దేశంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న సంస్థగా ‘జాక్వార్’ నిలుస్తుందన్నారు. విజయనగరం, మధురవాడతోపాటు విశాఖ నగరంలో మూడు షోరూమ్‌లు ఉన్నాయన్నారు. షోరూమ్ ప్రొప్రయిటర్ ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచంలోనే గుర్తింపు ఉన్న జాక్వార్ కంపెనీకి డీలర్‌గా, డైరెక్టర్స్ క్లబ్ మెంబర్‌గా తనకు అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. కస్టమర్లకు అందుబాటులో ఉంటూ అత్యుత్తమ సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి హెడ్ (ఏపీ అండ్ టీఎస్) అభిజీత్‌సింగ్, కంపెనీ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లా శ్రీనివాస్‌కు బీసీ కమిటీ సన్మానం



పల్లా శ్రీనివాస్‌కు అభినందనలు తెలుపుతున్న పరదేశీ తదితరులు

మహారాణిపేట, జూన్ 7: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలుపొందిన గాజువాక శాసన సభ్యుడు పల్లా శ్రీనివాసరావును టీడీపీ బీసీ కమిటీ రాష్ట్ర కార్యదర్శి బొట్టా పరదేశీయాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం నాయకులు మర్యాదపూర్వకంగా కలసి పుష్ప గుచ్ఛమిచ్చి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి నరసింగరావు, ఐటీడీపీ సభ్యులు గరికిన ప్రతాప్, భాస్కరశర్మ, సారిపల్లి ఉదయ్‌భాస్కర్, బోర అప్పల సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

పూర్ణామార్కెట్, జూన్ 7: వన్‌టౌన్ కనకమహాలక్ష్మికి శుక్రవారం ఉదయం 8గంటల సమయంలో క్షీరాభిషేక సేవలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజల్లో ఉభయదాతలు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి విగ్రహానికి పసుపు, కుంకుమ పూలతో అలంకరించి భక్తుల కు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులుపాల్గొన్నారు.

గంటాకు అభినందనలు



గంటా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛమిస్తున్న మహేష్, వెంకటేశ్వరరావు

కంచరపాలెం, జూన్ 7 : మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యేగా విజయదుందుభి మోగించిన గంటా శ్రీనివాసరావును జీవీఎంసీ 55వార్డు కూటమి ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా తెలుగుయువత అధికార ప్రతినిధి జోగా మహేష్‌రావుతో పాటు 55వ వార్డు జోగా వెంకటేశ్వరరావు, బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ జి.గోవింద్ తదితరులు గంటాను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కూటమి నేతృత్వంలో రాష్ట్రం మళ్లీ అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. వైసీపీ రాక్షస పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగిందని హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ స్తంభంనుంచి జారిపడి లైన్‌మెన్ మృతి



మృతుడు పాలమరశెట్టి వెంకటరావు (ఫైల్‌ఫోటో)

వేపగుంట/ మల్కాపురం 7: అప్పన్నపాలెం సబ్‌స్టేషన్‌లో జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న పొలమరశెట్టి వెంకటరావు (45) ప్రమాదవశాత్తూ విద్యుత్ స్తంభంనుంచి జారి పడి మృతి చెం దారు. పెందుర్తి పోలీసులు, స్థానికులందించిన వివరాలివి.. అప్ప న్నపాలెం వాంబేకాలనీ ఎదుట ఉన్న సబ్‌స్టేషన్‌లో వెంకటరావు జూనియర్ లైన్‌మెన్ విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం 11.30గంటల సమయంలో మెయింటెన్స్‌లో భాగంగా స్టేషన్‌లోఉన్న ఎయిర్ బ్రేక్ స్విచ్‌లు ఆఫ్‌చేసేందుకు పైకి ఎక్కారు. ఈ క్రమంలో కాలుజారి పడిపోయాడు. కింద ఎర్తింగ్ కోసం ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మకు తలకు వెనుక భాగంలో బలంగా తగలటంతో విపరీతంగా రక్తస్రా వం జరిగింది. వెంటనే సిబ్బంది గోపాలపట్నంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించేలోపే ఆయన మృతి చెం దారు. వెంకటరావుకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవలే ఉద్యో గం పర్మినెంట్ అయినట్లు సమాచారం. కుటుంబ సభ్యులు ఫిర్యాదుతో మృతదేహాన్ని కేజీహెచ్‌కు పోస్టుమార్టం కోసం తరలించారు. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకటరావు మృతితో స్వగ్రామం కొత్తపాలెంలో విషాదఛాయలు అములుకున్నాయి. ఆయన గ్రామ గౌరీ సంఘం కార్యదర్శిగా సేవలందించారు. గౌరీ సంఘ సభ్యులు, గ్రామస్తులు వెంకటరావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపాత

రైలు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



మృతుడు వసంతకుమార్ (ఫైల్)

గోపాలపట్నం, జూన్ 7: గోపాటపట్నం నుంచి కొత్తపాలెం వెళ్లే అండర్‌పాస్‌వే సమీపాన గుర్తు తెలియని రైలు ఢీకొన్న ప్రమా దంలో యువకుడు మృతి చెందా డు. జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. విజయ నగరం జిల్లా పూసపాటిరేగ సమీపంలోని కుమిలి గ్రామా నికి చెందిన కర్రి వసంతకుమార్ (19) ఐటీఐ పూర్తి చేసి అప్రెంటిస్ చేసేందుకు విశాఖ వచ్చాడు. కొత్తపాలెంలో బంధువుల ఇంటివద్ద ఉంటున్నాడు. గురువారం రాత్రి భోజనం చేసిన తరువాత బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వచ్చాడు. ఎంతకీ రాకపోవడంతో బంధువులు ఉదయం పరిసర ప్రాంతాల్లో వెతికారు. రైల్వే ట్రాక్‌పై మృతదేహం పడిఉందన్న సమాచారంతో రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా బంధువులకు స మాచారం అందించారు. కొద్ది రోజులుగా బంధువుల ఇంటివద్దనే ఉంటున్న వసంతకుమార్ అనుకోని విధంగా జరిగిన ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీ రవుతున్నారు. జీఆర్‌పీ ఎస్సై బాలాజీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య హత్య కేసులో యావజ్జీవ శిక్ష

కంచరపాలెం, జూన్ 7 : భార్యను హత్యచేసిన కేసులో భర్తకు యావజ్జీవ కారాగార శిక్షను విధిస్తున్యాయస్థానం శుక్రవారం తీర్పును వెలువరించింది. వివరాలివి.. మృతురాలు నీలపు రత్నం జీవీఎంసీలో ఆరోగ్య కార్యకర్త. భర్త నీలపు పోలరాజుతో కలిసి కంచరపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో నివాసముండేవారు. మద్యానికి బానిసై పోలరాజు నూకరత్నంను వేధిస్తు ఉండేవాడు. 2015వ సంవత్సరంలో నూకరత్నంకు చెందిన ఇల్లును వి క్రయించగా వచ్చిన రూ.1.7లక్షలు తనకు ఇవ్వాలని నూకరాజు రోజూ గొడవ పడుతుండేవాడు. కొంత సొమ్ము కనిపించకపోవడంతో తగాదా చోటు చేసుకోగా, నూకరత్నంపై భర్త పోలరాజు కిరోసిన్ పోసి నిప్పంటించాడు. కాలిన గాయాలతో ఆమె కేజీహెచ్‌లో చికిత్స పొందుతు మృతిచెందింది. దర్యాప్తు అధికారి రఘువీర్ విష్ణు నిందుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విశాఖ 6వ అదనపు జిల్లా కోర్టులో విచారణ జరిపారు. నేరం రుజువుకావడంతో ముద్దాయికి యావజ్జీవ కఠినకారాగారంతో పాటు రూ.10వేలు జరిమానా విధిస్తు సంచలన తీర్పును వెలువరించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన అధికారులను పోలీస్ కమిషనర్ డా.ఎ.రవిశంకర్, అదనపు జిల్లా మెజిస్ట్రేట్ ప్రశంసించారు.

అసైన్డ్ భూముల ఫైళ్లు స్వాధీనం చేసుకోవాలి

» జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్



అసైన్డ్ భూముల పత్రాలను చూపిస్తున్న మూర్తి యాదవ్

సీతంపేట, జూన్ 7: విశాఖపట్నం, విజయనగరం జిల్లాల కలెక్టరేట్‌లలో అసైన్డ్ భూముల ఫైళ్లు స్వాధీనం చేసుకోవాలని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్, సాయికాంత్ వర్మలపై నిఘా పెట్టి విచారణ జరపాలన్నారు. ఈ ఇద్దరు అధికారులు విశాఖ వచ్చాక భారీగా ఆస్తులు కొనుగోలు చేశారన్నారు.

సీఎస్ జవహర్ రెడ్డి విశాఖ రాకుండా, ఇక్కడి అధికారులపై ఒత్తిడి తేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాగానే జీవో నెంబర్ 596ను రద్దు చేసి ఈజీవో కింద చేసిన లావాదేవీలను పెం డింగ్ పెట్టాలన్నారు. మొత్తం వ్యవహారంపై విచారణ జరిపి దళితుల భూములు కొట్టివేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్తరాంధ్రలో వేల కోట్ల రూపాయల విలువ చేసే వందల ఎకరాల అసైన్డ్ భూములు జీవో 596 ముసుగులో కొట్టేసిన ఐఏఎస్ అధికారులపై నిఘా పెట్టాలని, సంబంధిత ఫైళ్లు మాయంకాకుండా విశాఖ, విజయనగరం జిల్లాల కలెక్టరేట్‌ల నుంచి వాటిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారికి బెదిరింపు కాల్

» నిందితుడ్ని చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ సునీల్



ముద్దాయి పవన్

కొమ్మాది, జూన్ 7 : డబ్బులు ఇవ్వకపోతే కుమారుడ్ని చంపేస్తానని బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని పీఎంపాలెం పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు. నార్త్ జోన్ ఏసీపీ బి.సునీల్, పీఎంపాలెం సీఐ వై. రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. అనకాపల్లి జిల్లా రాం బిల్లి మండలం దారపాలెం గ్రామానికి చెందిన శివకోటి నాగ వెంకట పవన్ జల్సాలకు అలవాటు పడ్డాడు. దీంతో సుమారు రూ. 15 లక్షల వరకూ అప్పులు చేశాడు. ప్రస్తుతం అతను పీఎంపాలెంలో నివసిస్తున్నాడు. ఈనెల 2న అతను పీఎం పాలెం కార్ షెడ్ ప్రాంతానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి పోతిన వెంకట్రావుకు వాట్సాప్ కాల్ చేసి రూ. 20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే తన కుమారుడ్ని చంపుతానని బెదిరించాడు. దీంతో భయభ్రాంతులకు గురైన వెంకటరావు ఆ నంబరును ఫోన్‌లో బ్లాక్ చేశాడు. రెండు రోజుల తరువాత ఆ నంబరును అన్ బ్లాక్ చేయగా డబ్బులు ఇవ్వకపోతే నీకుమారుడ్ని చంపేస్తానని పవన్ నంబరు నుంచి మెసేజ్ వచ్చింది. దీంతో భయపడిన బాధితుడు పవన్‌కు ఫోన్ చేసి తన కుమారుడికి హాని తలపెట్టవద్దని రూ.5 లక్షల ఇవ్వడానికి అంగీకరించాడు. డబ్బులు సమకూర్చుకునేందుకు 6వ తేదీ ఉదయం 11 వరకు సమయం ఇవ్వాలని అభ్యర్థించాడు. ఈమేరకు గురువారం ఉదయం 7.59 నిమిషాలకు పవన్ సెల్ నుంచి మెసేజ్ వచ్చింది. డబ్బులు సాంకేతిక కళాశాల వద్ద ఉన్న నిర్మానుష్య ప్రదేశంలో అందజేయాలని తెలిపాడు. ఈ విషయాన్ని బాధితుడు పీఎం పాలెం పోలీసులకు చెప్పగా వారు చాకచక్యంగా వ్యవహరించి, బాధితుడు పవన్‌కు డబ్బులిచ్చే సమయంలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి రూ. 2. 40 లక్షల నగదు, కారు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. కాగా తనకు అప్పులు తీర్చే మార్గం తెలియక ఈ బెదిరింపునకు పాల్పడినట్టు నిందితుడు తెలిపారు.

ప్రజాగ్రహం

... 5వ పేజీ తరువాయి

ఇబ్బందులకు గురిచేశారు. రెండేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు టీడీపీ కూటమి గెలవగానే ధైర్యంగా వెళ్లి అక్కడి రోడ్డు బ్లాక్స్‌ను తొలగించేందుకు యత్నించారు. వారికి తెలుగుదేశం, జనసేన నాయకులు కూడా తోడయ్యారు. అయితే ఉన్నతాధికారులకు లేఖ ఇస్తే తామే తొలగిస్తామని పోలీసులు సర్ది చెప్పి, అక్కడ తాత్కాలికంగా స్టాపర్లు ఏర్పాటు చేశారు.

తాజాగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రక్షాళన అంటూ కొంతమంది మాజీ ప్రొఫెసర్లు, సిబ్బంది కలిసి గురువారం అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. వైస్ ఛాన్సలర్ ప్రసాదరెడ్డి విశ్వవిద్యాలయాన్ని వైసీపీ కార్యాలయంగా మార్చేశారనే విమర్శలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. జీవీఎంసీ ఎన్నికల సమయంలో టికెట్ల కేటాయింపు నుంచి వివిధ కార్పొరేషన్లలో పదవులకు నాయకుల ఎంపిక వరకు అన్ని పనులు విశ్వవిద్యాలయం వేదికగానే నిర్వహించారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంకా నిబంధనలకు విరుద్ధంగా నియా మకాలు చేపట్టారు. ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో విద్యా సంస్థల ప్రతినిధులను ఆహ్వానించి సమావేశాలు నిర్వహిస్తూ మీడియాకు దొరికిపోయారు. గత ఐదేళ్లుగా వైసీపీ కోసం సర్వేలు, సమావేశాలు నిర్వహించిన వర్సిటీ పాలకులు...ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారంటూ సెలవులో ఉన్న అసోసియేట్ ప్రొఫెసర్ లావణ్య (గాజువాక టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు భార్య)ను సస్పెండ్ చేశారు. తాము చేస్తే ఒప్పు...ఇతరులు చేస్తే తప్పు అన్నట్టుగా వ్యవహరించిన పాలకుల చర్యలను నిరసిస్తూ విద్యార్థి సంఘాలు ఏయూ ప్రాంగణంలో నినదించాయి.

ఆ రెండింటిని ప్రక్షాళన చేయాల్సిందే

వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌ను రాజకీయ క్రీడా వేదికగా మార్చేసింది. కార్యవర్గాన్ని అడ్డగోలుగా వైసీపీ కీలక నేతల బంధువులు, అనుచరులతో నింపేసింది. అసోసియేషన్ ఎన్నికల్లో ఎవరూ పోటీ చేయకూడదని పరోక్షంగా హెచ్చరికలు పంపింది. క్రీడాకారుల విషయంలోను రాజకీయ నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పుడు క్రీడాభిమానులంతా ఈ రాజకీయ నియామకాలకు స్వస్తి చెప్పి గతంలోలా క్రీడాభివృద్ధికి తోడ్పాటు అందించే వారినే అసోసియేషన్‌లో నియమించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏపీ ఫిల్మ్ క్లబ్‌లోను అదే పరిస్థితి

వాల్తేరు క్లబ్‌లో జొరబడడానికి యత్నించి విఫలమైన వైసీపీ నేతలు తిమ్మాపురంలో ఉన్న ఏపీ ఫిల్మ్ క్లబ్‌ను అడ్డగోలుగా చెరబట్టారు. అప్పటివరకు కీలకంగా ఉన్న సినిమా రంగానికి చెందిన వారిని పక్కకు తప్పించి వైసీపీ భజనపరులను అందులో చొప్పించారు. క్లబ్ సభ్యత్వం రూపేణా సమకూరిన కోట్లాది రూపాయలతో భూమి కొనుగోలుకు ప్రయత్నం చేశారు. నాలుగు నెలల క్రితమే ఏకపక్ష ఎన్నికలు నిర్వహించి, అదే కార్యవర్గాన్ని పునరుద్ధరించుకున్నారు. దీనిపై కూడా దృష్టి పెట్టాలనే వాదన వినిపిస్తోంది.

ఏయూలో విగ్రహం మాటేమిటో?

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటు చేయించారు. ఇదంతా గత ఏడాది జూలైలో జరిగింది. విగ్రహానికి అంతా పూలమాలలు వేసి నివాళులు అర్పించేందుకు వీలుగా చుట్టూ రెయిలింగ్ నిర్మించారు. ప్రసాదరెడ్డి వీసీ అయినప్పటి నుంచి వైఎస్ జయంతి, వర్ధంతి సందర్భంగా కార్యక్రమాలు నిర్వహించేవారు. జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు నాడు ఆ విగ్రహం ముందే కేక్ కట్ చేసేవారు. వాటిపై పత్రికల్లో వార్తలు వచ్చినా పట్టించుకునేవారు కాదు. వైసీపీ కోసం పనిచేసిన వీసీని సాగనంపడంతో పాటు క్యాంపస్‌లో వైఎస్ విగ్రహాన్ని తొలగించాలని విద్యార్థి సంఘాలు ప్రతినిధులు, టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

‘ఫ్రీ హోల్డ్’లో సిబ్బంది బలి!

... 5వ పేజీ తరువాయి

ఎకరాలకు ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్ అనుమతులు మంజూరుచేసిన విషయం ‘ఆంధ్రజ్యోతి’ వెలుగులోకి తీసుకురావడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆనందపురం తహసీల్దార్ హేమంతకుమార్, ఇతర సిబ్బంది గురువారం భూమిని పరిశీలించారు. అనంతరం విచారణ నివేదిక రూపొందించినట్టు తెలిసింది. ఒక సర్వే నంబరులో భూమి ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ మంజూరు కోసం ప్రతిపాదనలు సంబంధిత వీఆర్వో నుంచి తీసుకుంటారు. ఇంకా మండల రెవెన్యూ కార్యాలయంలో ఉన్న రికార్డులు, ఆన్‌లైన్‌లో ఉన్న వివరాలను పరిశీలించిన తరువాతే ఆ ప్రతిపాదనలపై తహసీల్దారు సంతకం చేసి ఆర్డీవోకు పంపించాలి. విచిత్రం ఏమిటంటే రామవరం సర్వే నంబరు 164-3లో 1.53 ఎకరాలను ఇళ్ల పట్టాలకు కేటాయించిన విషయం ఆనందపురం తహసీల్దారు కార్యాలయ రికార్డుల్లో ఉంటుంది. అయినప్పటికీ ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్ మంజూరుకు ఎలా సిఫారసు చేయాల్సి వచ్చిందనే వివరాలు విచారణ నివేదికలో పేర్కొనలేదు. దీనిపై భీమిలి ఆర్డీవో, జిల్లా కలెక్టర్ మరింత లోతుగా విచారణ చేపట్టి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని రామవరం గ్రామస్థులు కోరుతున్నారు. దీనికి అనుగుణంగానే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

వైసీపీ ఆఫీస్ సిబ్బందికి జీతాలు నిల్

... 5వ పేజీ తరువాయి

సుబ్బారావుకు అప్పగించారు. ఆయన వ్యక్తిగత కారణాలతో పార్టీ కార్యక్రమాలకు ఇటీవల హాజరుకావడం లేదు. దాంతో సిబ్బందికి జీతాలు లేవు. ఈ విషయాన్ని ఉత్తరాంధ్ర పార్టీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి దృష్టికి తీసుకువెళ్లినా పెద్దగా పట్టించుకోలేదు. నాలుగు రోజుల నుంచి కార్యాలయానికి ఎవరూ రావడం లేదు. రెండు నెలలుగా జీతాలు లేవని, తమ పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదని కార్యాలయ సిబ్బంది వాపోతున్నారు. పార్టీ కార్యాలయానికి సెంట్రల్ ఆఫీసు ఒక మేనేజర్‌ను నియమించింది. ఆయనకు కూడా మూడు నెలలుగా జీతం ఇవ్వలేదని తెలిసింది. పార్టీ అధికారంలో ఉంటే ఈరోజు కాకపోతే రేపు అయినా ఇస్తారనే నమ్మకం పని వారిలో ఉండేది. ఇప్పుడు పార్టీ ఓడిపోవడం, నాయకులు ఎవరూ కార్యాలయం ముఖం చూడకపోవడంతో వారు లబోదిబోమంటున్నారు. జీతాలే కాకుండా టీ, కాఫీల కోసం తీసుకున్న పాలకు చెల్లించాల్సిన బిల్లులు కూడా పెండింగ్ ఉండిపోయాయి. ఈ భవనానికి మార్చి నెల వరకూ బిల్డర్ విద్యుత్ బిల్లు చెల్లించేవారు. అప్పగించేసిన తరువాత పార్టీయే కట్టుకోవలసి ఉంది. ఏప్రిల్ నుంచి ఆ బిల్లు కూడా చెల్లించలేదని తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

మల్కాపురం, జూన్ 7: మల్కాపురం పోలీసు స్టేషన్ పరిధి పోర్టురోడ్డు మారుతి జంక్షన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి రోడ్డుప్రమాదానికి గురై మృతి చెందిన సంఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. ఈ మార్గంలో సైకిల్‌పై వెళ్తుండగా లారీ వచ్చిబలంగా ఢీ కొన్నడంతో సదరు వ్యకి తీవ్రగాయాలకు గురై అక్కడిక్కడే మృతి చెందారు. ముఖం గుర్తుపట్టని విధంగా ఉంది. మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శాంతి సరోవరంలో చేరిన నీరు

ఆరిలోవ, జూన్ 7 : నగరంలోని జూపార్కులో ఉన్న శాంతి సరోవరంలో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరింది. గత రెండు నెలలు ఎండల తీవ్రతకు శాంతి సరోవరం పూర్తిగా ఎండిపోయిన విషయం తెలిసిందే. ఇటీవల పడుతున్న వర్షాలకు సరోవరంలో నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది.

చిట్టివలసలో దుర్గమ్మ తల్లి ఉత్సవాలు



తగరపువలస, జూన్ 7 : చిట్టివలస పరిసర ఏడు గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత దుర్గమ్మ తల్లి ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు సంతపేట, కొత్తపేట గ్రామాల ప్రజలు అమ్మవారికి పసుపు, కుంకుమ ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు.

ప్రైవేటు పాఠశాలలు తనిఖీ



శశి పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ శివరాణి

తగరపువలస, జూన్ 7 : తగరపువలసలోని శశి, సాయి రవీంద్ర, తదితర ప్రైవేటు పాఠశాలలను ఎంఈఓ ఎం. శివరాణి శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలల్లోని రికార్డులు, రిజిస్టర్లు, విద్యార్థుల హాజరు పట్టిక, ఉపాధ్యాయుల వివరాలను పరిశీలించారు. అలాగే తరగతి గదులు, టాయిలెట్లను పరిశీలించి పాఠశాలల పునఃప్రారంభం నాటికి పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని యాజమాన్యాలకు సూచించారు. ఆమెతో పాటు శశి పాఠశాల ప్రిన్సిపాల్ ధనుంజయరావు, సాయి రవీంద్ర పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ ఉన్నారు.

అప్పన్నకు సహస్ర తులసీ దళార్చన

సింహాచలం, జూన్ 7 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా శుక్రవారం సహస్రనామ తులసీ దళార్చన నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూదేవి, నీలాదేవి సమేతంగా కల్యాణ మండపంలో రజిత ఆసనంపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ సహస్ర నామావళి పఠిస్తూ తులసీ దళాలతో అర్చనలు చేశారు. అదే వేదికపై పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

కొమ్మాది, జూన్ 7 : మహిళ అదృశ్యంపై ఫిర్యాదు అందినట్టు పీఎంపాలెం పోలీసులు తెలిపారు. చెంబు సునీత మారికవలసలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో ఒంటరిగా నివాసం ఉంటుంది. గత నెల 30న ఆమె సోదరుడు రఘునాథ్ ఫోన్ చేయగా స్విచ్ఛాప్ రావడంతో ఇంటి వెళ్లి చూడగా తాళం వేసి ఉంది. దీంతో ఆయన వెనక్కి వచ్చేశారు. మళ్లీ గురువారం ఇంటికి వెళ్లి చూడగా తాళం వేసి ఉండడం, ఫోన్ స్విచ్ఛాప్ రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ఎంవీపీ కాలనీ, జూన్ 7 : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీర్ రామచంద్రమూర్తి అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మహిళా జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగరంలో పలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి అనేక చైతన్య కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణకుమారి, రవితేజ, రాజేశ్వరి, జేవీ రత్నం పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **సత్యభామ :** సంగం, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), శ్రీహరిపురం (ఎస్.వి.సి.లిఖిత)
- **లవ్ మౌళి :** శారద, లక్ష్మీ (గాజువాక)
- **గోల్డ్ నెం.1 :** శ్రీకాంతి
- **గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి :** శరత్, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గం గం గణేశా :** శ్రీవెంకటేశ్వర, సౌజన్య (గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ), గణేష్ (తగరపువలస)
- **భజే వాయు వేగం :** మెలోడి, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), తాతా (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి)
- **లవ్‌మీ :** గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 28,టమాటా 48, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 28, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 40, బీరకాయలు 40, ఆనపకాయలు 24, కాలీఫ్లవర్ 42, క్యాబేజ్ 25, క్యారెట్ 25, దొండకాయలు 22, బంగాళా దుంపలు 28, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 58, అల్లం (పాతది) 156, బరబటి 40, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 38, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 110, పొటల్స్ 38, కీరదోస 26, కాప్సికమ్ 72, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 36, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	455
విజయనగరం	459
శ్రీకాకుళం	459

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 125
ఫారం ధర	-- 145
విత్ స్కిన్	-- 260
స్కిన్‌లెస్	-- 270

కేజీహెచ్‌కు సీఎస్ఆర్ నిధులు

- సుమారు రూ.20 కోట్లతో వార్డులు, క్యాజువాల్టీల్లో సదుపాయాలు
- మరో రూ.10 కోట్లతో సంక్షేమ వసతి గృహాల్లో సదుపాయాలు
- సజావుగా ఎన్నికల ప్రక్రియ
- పాత్రికేయుల సహకారం మరువలేం
- కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున



హోర్డింగ్ వద్ద కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్, జేసీ అశోక్

విశాఖపట్నం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వివిధ పరిశ్రమలు, వ్యాపార సంస్థలు సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) కింద అందించిన నిధుల నుంచి సుమారు రూ.30.82 కోట్లు వెచ్చించి కేజీహెచ్, సంక్షేమ వసతి గృహాలు అభివృద్ధి చేశామని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేలాది మందికి వైద్యం అందించే కేజీహెచ్‌లో రూ.18 కోట్లతో అనేక వార్డులు, క్యాజువాల్టీల్లో మౌలిక వసతులు కల్పించామన్నారు. ఎంఆర్ఐ, సీటీ స్కాన్ ఇతర పరీక్షలకు కొత్త మిషనరీ తెప్పించామని, రోగుల కోసం బ్యాటరీ వాహనాలు సమకూర్చామన్నారు. హెచ్‌పీసీఎల్ సహకారంతో రూ.రెండు కోట్లతో బర్న్ వార్డును ఆధునికీకరించడానికి ప్రతిపాదించామన్నారు. అలాగే సాంఘిక, బీసీ సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న 23 వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన మేరకు పూర్తిస్థాయి వసతుల కల్పనకు రూ.10.82 కోట్లు ఖర్చు చేశామన్నారు. జిల్లాలో పేదలకు వైద్యం, ఇతరత్రా సాయం అందించడానికి సంజీవని నిధి ఏర్పాటుచేశామన్నారు. భవిష్యత్తులో ఆదాయం పెంచుకునేందుకు యంత్రాంగం ఆధ్వర్యంలో నాలుగు పెట్రోల్ బంకులు ఏర్పాటుచేస్తామన్నారు.

గత ఏడాది చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ నుంచి మూడు రోజుల క్రితం ముగిసిన ఎన్నికల ప్రక్రియ వరకు అంతా సజావుగా సాగిందని కలెక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. ఎక్కడైనా లోపాలు ఉంటే పత్రికలు వెంటనే వెలుగులోనికి తీసుకురావడంతో చర్యలు తీసుకునేందుకు ఆస్కారం ఏర్పడిందన్నారు. ఎన్నికల నిర్వహణలో ఓటర్లు, అన్ని పార్టీల నేతలు, అధికారులు, సిబ్బంది సహకరించారన్నారు. ముఖ్యంగా జర్నలిస్టుల సహకారం మరువలేనిదని కొనియాడుతూ ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సమాజానికి అన్ని విధాలుగా సేవలు అందిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి జిల్లా యంత్రాంగం తరఫున అనేక విధాలుగా కృషిచేశామని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. గత ఏడాది జర్నలిస్టులకు ఆరోగ్య బీమా ప్రీమియం చెల్లించామని, ఉచిత వైద్యపరీక్షలు చేపట్టామన్నారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి అపోలో ఆస్పత్రిలో జర్నలిస్టుతోపాటు జీవిత భాగస్వామికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించారు. దీనికి సంబంధించి జిల్లా పౌర సంబంధాల అధికారి షెడ్యూల్ ఖరారు చేస్తారన్నారు. జర్నలిస్టులకు వచ్చే ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఆరోగ్య బీమా ప్రీమియం చెల్లించేందుకు నిధి ఏర్పాటుచేశామని తెలిపారు. అర్హులైన పాత్రికేయులకు ఇళ్ల స్థలాలకు రెండు, మూడు చోట్ల భూమి గుర్తించి రేటు ఖరారుచేశామన్నారు. అయితే కొత్త ప్రభుత్వం విధానాలకు అనుగుణంగా ఇళ్ల స్థలాలకోసం కార్యాచరణ రూపొం దిస్తామన్నారు. సిటీ పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యనార్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో మీడియా ప్రశంసనీయమైన పాత్ర పోషించిందన్నారు. విలేకరుల సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, నియోజకవర్గ ఆర్వోలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, లక్ష్మారెడ్డి, అఖిల, శేషశైలజ, సీతారామమూర్తి, డీపీఆర్వో ఎస్వీ రమణ పాల్గొన్నారు.

175 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

ఎంవీపీ కాలనీ, జూన్ 7 : ప్రజా పంపిణీకి సంబంధించిన 175 బస్తాల బియ్యం అక్రమ రవాణాను పోలీసులు అడ్డుకున్నారు. నగరంలో నుంచి విజయనగరం వైపు వెళ్తున్న నాలుగు వాహనాలను వెంకోజీపాలెం వద్ద ఎంవీపీ స్టేషన్ సీఐ సంజీవరావు ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం ఉదయం పట్టుకున్నారు. అందులోని బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకుని, వాహనాలను సీజ్ చేశారు. పూర్ణామార్కెట్‌కు చెందిన వాడబోయిన అప్పలరాజు, దొడ్డి రాజు, జ్ఞానాపురంనకు చెందిన కొక్కిన రమణ, నాయిన సన్యాసిరావును అదుపులోకి తీసుకున్నారు. సివిల్ సప్లై అధికారులకు అప్పగించారు. కాగా ఉదయం ఆరు గంటలకు జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన సమాచారం ఇవ్వడానికి ఎంవీపీ పోలీసులు తాత్సారం చేయడం పలు అనుమానాలకు తావిచ్చింది.

దివ్యాంగ బాలలకు విద్యా సౌకర్యాలు



పద్మనాభంలో దివ్యాంగ బాలుడితో అధికారులు

పద్మనాభం, జూన్ 7 : భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగ బాలలకు విద్యా సౌకర్యాలు కల్పిస్తున్నామని సమగ్ర శిక్ష సహిత విద్య జిల్లా సమన్వయాధికారి బి. గీత చెప్పారు. దివ్యాంగ విద్యార్థుల గుర్తింపునకు పద్మనాభం, రెడ్డిపల్లి గ్రామాల్లో చేపడుతున్న సర్వేను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మే 1 నుంచి జరుగుతున్న సర్వే ద్వారా ఇప్పటివరకు 11 భవిత కేంద్రాల్లో 300 మంది దివ్యాంగ పిల్లలను గుర్తించి పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించామన్నారు. పద్మనాభం మండలంలో 22 మందిని నమోదు చేశారన్నారు. భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగ బాలలకు విద్యతో పాటు ఫిజియోథెరపీ వంటి వైద్య సౌకర్యంతో పాటు రవాణా అలవెన్సు, సహాయకుల అలవెన్సు, ఉపకరణాలు, ఎంఆర్ కిట్లు పంపిణీ చేస్తామని చెప్పారు. 21 రకాల అవయవ లోపాలు ఉన్న దివ్యాంగులకు భవిత కేంద్రాల్లో ప్రవేశం కల్పించి చదువుతో పాటు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీఓ అప్పలనాయుడు, ఎంఈఓ రమణ, ప్రత్యేక ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

18న లక్ష్మీనారాయణుల వార్షిక తిరు కల్యాణోత్సవం

సింహాచలం, జూన్ 7 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయ ఆవరణలోని లక్ష్మీనారాయణుల వార్షిక తిరుకల్యాణోత్సవం ఈనెల 18న నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అలాగే మాస ఆర్జిత సేవల్లో భాగంగా నృసింహస్వామి ఆవిర్భావ నక్షత్రం స్వాతిని పురస్కరించుకుని జరిగే ఆర్జిత స్వాతి నక్షత్ర హవనం కూడా ఆ రోజు ఉదయం ప్రభాతారాధనలు తరువాత చేయనున్నారు. అదే రోజు సాయంత్రం అప్పన్న స్వామి సోదరి, అడివివరం తదితర ఏడుగ్రామాల ప్రజల ఆరాధ్య దేవత పైడితల్లెమ్మ వార్షిక పండుగ మహోత్సవం నిర్వహించనున్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు

సింహాచలం, జూన్ 7 : అడివివరం శాఖా గ్రంథాలయంలో గత 24 రోజులుగా జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు శుక్రవారంతో ముగిసాయి. కార్యక్రమంలో సింహాచలం గురుకుల పాఠశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ బీవీ రామరాజు, గ్రంథాలయాధికారి నరసింహం, స్థల దాత దాసరి సన్యాసయ్య శెట్టి, కార్మిక నేత సీహెచ్ సూర్యనారాయణరాజు, టీటీడీ గీతా ప్రచారకులు వాసుదేవ, విశ్రాంత హెచ్ఎం వి. గౌరీశంకర్, యోగాచార్యులు సన్యాసిరావు, ఎ. భానుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీలోని నగర శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. శిబిరంలో భాగంగా చిన్నారులకు కథలు చదవడం, ఆంగ్లభాష ప్రావీణ్యం, లెక్కలు, జనరల్ సైన్స్, జీకే అండ్ యోగా, పేపర్ రీడింగ్, క్విజ్, డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ముగింపు వేడుకలకు ప్రముఖ రచయిత సుసర్ల సర్వేశ్వర శాస్త్రి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జి. శేఖర్, ఎ. సంతోష్ కుమార్, బి. ఆరుద్ర, జె. శంకర్రావు, గ్రంథాలయాధికారి కేవీఏ. ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఏయూలో చిత్ర కళా ప్రదర్శన

వెంకోజీపాలెం, జూన్ 7 : ఏయూ చిత్ర కళా విభాగంలో బీఎఫ్ఏ, ఎంఎఫ్ఏ చివర సంవత్సరం విద్యార్థులు తమ కోర్సుల్లో భాగంగా తయారు చేసిన వివిధ చిత్రాలు, శిల్పాలతో ఏర్పాటు చేసిన కళా ప్రదర్శనను రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్ శుక్రవారం ప్రారంభించారు. శివాజీపాలెంలోని ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను రిజిస్ట్రార్ తిలకించి విద్యార్థులను అభినందించారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎ. నరసింహరావు, విభాగాధిపతి సింహాచలం, పూర్వ ఆచార్యులు రమేష్, మహేశ్వర దాస్, తదితరులు పాల్గొన్నారు. కాగా ఏయూ ఇంజనీరింగ్ విద్యార్థినుల హాస్టల్ భవనాన్ని రిజిస్ట్రార్ పరిశీలించారు. హాస్టల్‌లో నూతనంగా అభివృద్ధి చేస్తున్న యూజీడీ వ్యవస్థను చూశారు. పనుల ప్రగతిని ఇంజనీర్ శంకరరావును అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రార్‌తో పాటు చీఫ్ వార్డెన్ ఆచార్య దుర్గారాణి, తదితరులు ఉన్నారు.



చంద్రబాబునాయుడును కలిసి శుభాకాంక్షలు తెలిపిన రవితేజ

చంద్రబాబు, లోకేశ్‌ను కలిసిన గంటా రవితేజ

భీమునిపట్నం, జూన్ 7 : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌ను భీమిలి నియోజకవర్గ కూటమి విజేత గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ శుక్రవారం మంగళగిరి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళగిరి నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో విజయం సాధించినందుకు లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలిపి, అభినందించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలని లోకేశ్‌ను కోరారు. అలాగే నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా ఎన్నికైన పొంగూరు నారాయణను కూడా రవితేజ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'మత్స్యకారుల ఇబ్బందులు తొలగించాలి'

భీమునిపట్నం, జూన్ 7 : వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు చెల్లించే మత్స్యకార భరోసా చెల్లింపులో గత వైసీపీ ప్రభుత్వం సృష్టించిన అడ్డంకులను తొలగించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు కోరారు. శుక్రవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ జీవో ప్రకారం ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకూ వేట నిషేధం అమలులో వుంటుందన్నారు. ఈ సమయంలో మత్స్యకార కుటుంబానికి రూ. 10 వేలు చొప్పున ప్రభుత్వం జీవన భృతి చెల్లిస్తుందన్నారు. అయితే గత ప్రభుత్వం మత్స్యకారులు వేటకు వెళ్లే సమయంలో బోట్లకు వినియోగించాల్సిన డీజిల్ ఆయిల్ రాయితీ కార్డును ఉపయోగించడం లేదన్న కారణంతో జిల్లాలో వున్న 2061 మంది మత్స్యకారులకు జీవన భృతిని నిలిపివేసిందన్నారు. ఎన్నో ఏళ్లుగా వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు జీవన భృతి అందుతుందని, రాష్ట్రంలో గత ప్రభుత్వ వైఖరి వల్ల అన్యాయం జరిగిందని చెప్పారు. దీనిపై నూతన ప్రభుత్వం పునరాలోచన చేసి, న్యాయం చేయాలని ఆయన కోరారు.

ప్రధానిగా మోదీ ఎన్నిక పట్ల హర్షం



బీజేపీ కార్యాలయం వద్ద ఆనందం వ్యక్తం చేస్తున్న నాయకులు

పెదవాల్తేరు, జూన్ 7 : నెహ్రూ తరువాత ప్రధాన మంత్రి పదవిని వరుసగా మూడుసార్లు చేపట్టిన ఘనత మోదీకి దక్కుతుందని బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర అన్నారు. ప్రధానిగా మోదీ ఎన్నిక కావడంతో శుక్రవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎన్‌డీఏకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ అనేక పార్టీలతో కలిసి ఇండియా కూటమిగా ఏర్పడి, ఎన్ని కుట్రలు చేసినా గెలవలేకపోయిందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎస్‌వీఎస్ ప్రకాష్ రెడ్డి, శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి విజయానందరెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదర్ యాదవ్, పాలిమేర శ్రీనివాస్, ఎన్‌వీఎస్ రాజావర్మ, శ్రీరంగం ధనేశ్వరరావు, మోహన్‌రావు పాల్గొన్నారు.

నేడు పంచకర్ల కృతజ్ఞత సమావేశం

పరవాడ, జూన్ 7 : పెందుర్తి జనసేన ఎమ్మెల్యేగా ఎన్నికైన పంచకర్ల రమేష్‌బాబు శనివారం వెన్నెలపాలెం కల్యాణ మండపంలో కృతజ్ఞత సమావేశాన్ని నిర్వహించనున్నారు.ఉదయం తొమ్మిదిన్నర గంటలకు నిర్వహించనున్న సమావేశానికి జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని రావాడ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు కోరారు.



ఏయూ గేటు వద్ద కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేస్తున్న నాయకులు



98వ వార్డులో కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ నరసింహం

వాడవాడలా కూటమి విజయోత్సవ సంబరాలు

వెంకోజీపాలెం, జూన్ 7 : ఏయూ గేటు వద్ద టీడీపీ నాయకులు శుక్రవారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్టాభిరామ్ మాట్లాడుతూ జగన్ పాలనలో వర్సిటీలు వైసీపీ కార్యాలయాలుగా మార్చారని దుయ్యబట్టారు. ఏయూలో రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని తొలగించి, సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బొట్టా వెంకటరమణ, అమ రేంద్ర, మూర్తి, టీఎన్‌టీయూసీ నాయకులు మండల అప్పారావు, అలమండ రామకృష్ణ, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి రావాడ సీతారాం, బీసీ సెల్ కార్యదర్శి దాసరి శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం : కూటమి అఖండ విజయం నేపథ్యంలో 98వ వార్డులో నేతలు సంబరాలు జరిపారు. తొలుత వార్డు కార్పొరేటర్ నరసింహం, అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్ సారథ్యంలో కార్యకర్తలు, అభిమానులు, నేతలు సింహాచలం తొలిపావంచా వద్ద సింహాద్రినాథునికి కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించారు. తరువాత కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో వార్డు జనసేన అధ్యక్షుడు సూరిబాబు, బీజేపీ ప్రధాన కార్యదర్శి శరత్, కేవీ రామకృష్ణ, టీడీపీ వార్డు ఉపాధ్యక్షుడు ధర్మరాజు, శిరిపురపు సురేష్, తెలుగు యువత కార్యదర్శి అవినాష్‌బాబు, రౌతు రాంబాబు, టీఎన్‌టీయూసీ నేత శీర కృష్ణయాదవ్, మేకా కాసు గోపాల్, మజ్జి చంద్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

మధురవాడ : జీవీఎంసీ ఏడో వార్డు పిల్లకోమటివానిపాలెంలో టీడీపీ నాయకులు కూటమి విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గంటా, ఎంపీగా శ్రీభరత్ అత్యధిక మెజారిటీ సాధించడంతో అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ,టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, వార్డు టీడీపీ అధ్యక్షుడు పిళ్లా నరసింగరావు, నాగోతి నరసింహనాయుడు, కానూరి అచ్చుతరావు, పోతిన సోంపాత్రుడు, సూర్యప్రకాష్, శివాజీ, భవానీ పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన వెలగపూడి



మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను తూర్పు కూటమి విజేత వెలగపూడి రామకృష్ణబాబు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. లోకేశ్ మంగళగిరి స్థానం నుంచి అత్యధిక మెజారిటీతో వెలగపూడి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

\- విశాఖపట్నం



గంటాను సత్కరిస్తున్న విశాఖ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ సభ్యులు

గంటాకు రియల్ ఎస్టేట్ అసోసియేషన్ సభ్యుల సత్కారం

ఎండాడ, జూన్ 7 : భీమిలి నియోజకవర్గం కూటమి విజేత గంటా శ్రీనివాసరావును విశాఖ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ అధ్యక్షుడు గుంజు నరసింహారావు ఆధ్వర్యంలో సభ్యులు ఘనంగా సత్కరించారు. శుక్రవారం వారు ఎంవీపీ కాలనీలో గంటా ను ఆయన నివాసంలో కలిశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఎస్. దుర్గాప్రసాద్, లక్ష్మణరావు, గోవిందరావు, సతీష్, నాగేశ్వరరావు, రోశయ్య, సత్యనారాయణ, డొక్కా లక్ష్మణరావు పాల్గొన్నారు. చిప్పాడ దివీస్ కంపెనీ జనరల్ మేనేజరు వైఎస్ కోటేశ్వరరావు కూడా గంటాకు శుభాకాంక్షలు తెలిపారు.

బండారుకు నేతల అభినందనలు



బండారును అభినందిస్తున్న టీడీపీ నాయకులు

భీమునిపట్నం (రూరల్), జూన్ 7 : మాడుగుల నియోజకవర్గం కూటమి అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తికి భీమిలి రూరల్ మండలానికి చెందిన టీడీపీ నాయకులు అభినందనలు తెలియజేశారు. శుక్రవారం వారు వెన్నెలపాలెం వెళ్లి బండారును ఆయన నివాసంలో కలిశారు. ఈ కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గాడు వెంకటప్పడు, సింగనబంద సర్పంచ్ జి. వెంకటనారాయణ, లక్ష్మీపురం అయ్యప్ప సేవా పీఠం చైర్మన్ జి. తాతినాయుడు, నాయకులు జి. ఎల్లయ్య తాళ్లవలస ఉప సర్పంచ్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీలో కష్టపడిన వారికి గుర్తింపు లేదు'

వెంకోజీపాలెం, జూన్ 7 : పార్టీలో కష్టపడిన నాయకులను, కార్యకర్తలను గుర్తుంచుకోకపోతే ఫలితాలు ఇలానే ఉంటాయని, ఇప్పటికైనా వైసీపీ అధినేత జగన్ బుద్ధి తెచ్చుకోవాలని వీఎంఆర్‌డీఏ మాజీ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అన్నారు. శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.తూర్పు నియోజకవర్గంలో పార్టీ కోసం తొమ్మిదేళ్లు కష్టపడి పని చేసిన తనకు గుర్తింపు లేదన్నారు. కేవలం బీసీనన్న వివక్షతో సీటు కేటాయించలేదని, దాని ఫలితమే ఈ ఘోర పరాజయమన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

పరీక్షల విభాగం పరిశీలన

వెంకోజీపాలెం, జూన్ 7 : ఏయూ పరీక్షల విభాగాన్ని రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్ శుక్రవారం పరిశీలించారు. పరీక్షల విభాగంలోని పలు విభాగాలను ప్రత్యక్షంగా పరిశీలించి, సర్టిఫికెట్ల జారీ, సిబ్బంది విధులు నిర్వహిస్తున్న విధానం తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నూతనంగా ఆధునికీకరించిన టాయిలెట్స్ బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి అప్పలనరసింహరాజుకు సన్మానం



అప్పలనరసింహరాజును సత్కరించిన నాయకులు

పద్మనాభం, జూన్ 7 : భీమిలి కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు గెలుపనకు కృషి చేయడంతో పాటు అత్యధిక మెజారిటీ రావడానికి కారణమైన మాజీ మంత్రి అప్పలనర్సింహరాజును టీడీపీ నాయకులు శుక్రవారం పాండ్రంగిలోని ఆయన నివాసంలో సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కారకర్తలకు ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేస్తూ పాండ్రంగిలో టీడీపీకి 1324 ఓట్ల మెజారిటీ రావడానికి కృషి చేశారన్నారు. ఉన్నతమైన విలువలతో కూడిన రాజకీయాలు నెరపిన ఆయన అడుగుజాడల్లో పని చేయడం తమ అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామరాజు, మహంతి అప్పలరమణ, కృష్ణ, సారధి, రమణ, వెంకటరావు, సంతు, ప్రేమ్, రాజేష్, సన్యాసిరావు, అభిరామ్ పాల్గొన్నారు.

విప్లవ వీరుడు గంటం దొరకు నివాళి

సాగర్‌నగర్, జూన్ 7 : ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు గంటం దొర శత వర్ధంతి రుషికొండ గిరిజన మ్యూజియంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీసీఆర్ అండ్ టీఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి. చినబాబు, సిబ్బంది గంటం దొర విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో గంటం దొర ధైర్య సాహసాలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తిగా నిలుస్తాయని చెప్పారు.

రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలి

ద్వారకా బస్‌స్టేషన్, జూన్ 7 : ప్రయాణికులకు రవాణా సౌకర్యాలతో పాటు లాజిస్టిక్స్ బిజినెస్ కూడా మెరుగుపరచాలని ఆర్టీసీ విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చింతా రవికుమార్ సూచించారు. శుక్రవారం ఆయన ఎంవీపీ కాలనీలోని ఈడీ క్యాంప్ కార్యాలయంలో డిపో మేనేజర్లు, కమర్షియల్ ఎగ్జిక్యూటివ్‌లు, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణికులకు రవాణా సేవలందించే ఆర్టీసీ బస్సులన్నీ ఫిట్‌గా ఉండాలని, అందుకు ఎప్పటికప్పుడు వాటిని సాంకేతిక విభాగం అధికారులు, సిబ్బందితో చెక్ చేయించాలని చెప్పారు. మెకానికల్, ఎలక్ట్రికల్, బాడీ విభాగాలు సరిచూసుకోవాలన్నారు. కమర్షియల్‌కు సంబంధించి, పార్శిల్ రవాణా ఆదాయాన్ని పెంచాలని సూచించారు. సమావేశంలో ఆర్టీసీ విజయనగరం జోన్ డిప్యూటీ చీఫ్ ట్రాఫ్ మేనేజర్ అప్పలనాయుడు, మన్యం అధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కప్ప స్తంభం ఆదాయం రూ. 8.6 లక్షలు

సింహాచలం, జూన్ 7 : కప్పస్తంభం ఆలింగనాల ద్వారా అప్పన్న ఖజానాకు గత నెలలో రూ. 8.6 లక్షల ఆదాయం సమకూరింది. దేవస్థానం నిర్ణయించిన రూ. 25 చెల్లించి, 34,457 మంది కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకోవడం ద్వారా రూ. 8,61,425 లక్షల ఆదాయం సమకూరినట్టు అధికారులు తెలిపారు.